హస్తం, కమలం 'మధ్య' పోరు

- నేడు 8 స్థానాల్లో రాష్ట్రంలో తుది దశ పోలింగ్
- గిరిజన ఓటు బ్యాంకుతో కాంగ్రెస్
- హిందుత్వ రాజకీయాలతో కాషాయ పార్టీ

4

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 278 | విజయవాడ, సోమవారం 13 మే 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 13 May 2024 | Rs



చెన్నై నిలిచింది!

8

- రాజస్థాన్‌పై సూపర్‌కింగ్స్ గెలుపు
- 3 వికెట్లతో విజృంభించిన సిమ్రన్‌జిత్ సింగ్
- ఛేదనలో రాణించిన రుతురాజ్ గైక్వాడ్

ఇసి కొరడా

- నంద్యాల ఎస్‌పి సహా 8 మంది పోలీసు అధికారులపై చర్యలు
- ముగ్గురిపై శాఖాపరమైన విచారణకు ఆదేశం



నంద్యాల ఎస్‌పి రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్, తిరుపతి బ్యూరో

పోలింగ్‌కు ఒక రోజు ముందు నంద్యాల ఎస్‌పితోపాటు డిఎస్‌పినా, సిఐపైనా ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. తిరుపతి జిల్లాకు చెందిన ఐదుగురు పోలీస్ అధికారులపైనా బదిలీ వేటు వేసింది. నంద్యాల పట్టణంలో అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించకూడదని ఇసి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అయినా, ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా సినీ నటుడు అల్లు అర్జున్... వైసిపి నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డికి ఎన్నికల్లో మద్దతు తెలపడానికి నంద్యాలకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకోగానే అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ నుండి శిల్పా రవి నివాసం వరకు ఎలాంటి అనుమతులూ లేకుండా ర్యాలీ నిర్వహించారు. దీనిపై నంద్యాల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలపై నంద్యాల పోలీసుల తీరుపై ఇసి సీరియస్ అయింది. తక్షణమే జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, డిఎస్‌పి రవీంద్రనాథ్ రెడ్డి, టూ టౌన్ సిఐ రాజారెడ్డిల పై ఛార్జ్‌షీ ట్ ఓపెన్ చేయాలని, వారిపై శాఖాపరమైన విచారణ జరిపి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తమ అనుమతి లేకుండా కేసు క్లోజ్ చేయెుద్దని హెచ్చరించింది. టిడిపి ఫిర్యాదు మేరకు తిరుపతి నియోజకవర్గంలో నలుగురు సిఐలను, ఒక ఎస్‌ఐని ఎన్నిక విధులకు ఇసి దూరంగా ఉంచింది. ఆదివారం సాయంత్రంలోపు అనంతపురంలోని డిఐజి కార్యాలయంలో వారు రిపోర్టు చేయాలని ఆదేశించింది. వీరంతా వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డిలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇసికి టిడిపి ఫిర్యాదు చేసింది. తిరుమల సిఐ జగన్‌మోహన్‌రెడ్డి టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి, శ్రీకాళహస్తి సిఐ అంజుయాదవ్ సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి, గాజులమండ్యం సిఐ అమరనాథ్‌రెడ్డి, తిరుపతి సిటీ సిఐ శ్రీనివాసులు సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొంది. వీరితోపాటు అలిపిరి ఎస్‌ఐ వినోద్‌పైనా ఇవే కారణాలతో ఇసి బదిలీ వేటు వేసింది.

తుది సమరం నేడే

పోలింగ్ కేంద్రాలకు 1.60 లక్షల ఇవిఎమ్‌ల తరలింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు తరలి వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 ఎంపి స్థానాల్లో సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 4,14,01,887 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 2,02,74,144 మంది, మహిళలు 2,10,56,137 మంది ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు థర్డ్ జెండర్స్ మరో 3,421 మంది ఉన్నారు. ఎన్నికల్లో ఎటువంటి హింసకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల నిర్వహణ 1,06,145 మందితో బందోబస్తు ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 నియోజకవర్గాలు సమస్యాత్మకమైనవిగా ఉన్నట్లు గుర్తించిన ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలను రంగంలోకి దించింది. ఎన్నికల విధులు మూడు లక్షల మంది ఉద్యోగులతో పాటు, భద్రతా సిబ్బందితో కలుపుకుని మొత్తం 4.06 లక్షల మంది ఉద్యోగులు నిర్వహిస్తున్నారు.



పాడేరు నుంచి ఎన్నికల సామగ్రిని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తున్న సిబ్బంది

1.60 లక్షల ఇవిఎమ్‌లు తరలింపు

రాష్ట్ర వ్యాప్తంగా 46,389 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1.60 లక్షల కొత్త ఇవిఎమ్‌లను వినియోగించనున్నారు. వీటికి అదనంగా మరో 20 శాతం ఇవిఎమ్‌లను ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉంచింది. మొదట్లో ప్రతిపాదించిన విధంగా 46,165 పోలింగ్ కేంద్రాలకు 1.45 లక్షల ఇవిఎమ్‌లు సరిపోతాయని, అదనంగా ప్రతిపాదించిన 224 ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాలకు మరో 15 వేల ఇవిఎమ్‌లు సమకూర్చారు. మొత్తమ్మీద 46,389 పోలింగ్ కేంద్రాల్లో 1.60 లక్షల కొత్త ఇవిఎమ్‌లను ఇసి వినియోగించనుంది.

వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన

జీరో వయొలెన్స్ లక్ష్యంగా రాష్ట్రంలోని 75 శాతం పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటుచేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎన్నికల కమిషన్ పర్యవేక్షిస్తోంది. 26 జిల్లాలకు సంబంధించి 26 టివి మానిటర్ల ద్వారా ఆయా జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మిగతా 2లో

ధన... మద్య ప్రవాహాలు

2

- బహిరంగంగా పంచుతున్న వైసిపి, ఎన్‌డిఎ కూటమి నాయకులు
- చోద్యం చూసిన ఎన్నికల అధికారులు, పోలీసులు

ఇండియా వేదిక, కమ్యూనిస్టు పార్టీలను

బలపర్చండి

- దేశ రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడండి
- ప్రజలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల్లో ఇండియా వేదిక, కమ్యూనిస్టు పార్టీలను బలపరచాలని, దేశ రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ఘట్టం చివరి స్థాయికి వచ్చింది. అన్ని పార్టీల మాటలూ, వాగ్దానాలూ, హామీలన్నింటినీ విన్నారు. ఈ రోజు మన రాష్ట్రం భవిష్యత్తు మీరు తీసుకున్న నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యంలేని లోటు అసెంబ్లీలో కనిపిస్తోంది. రెండు ప్రధానమైన పార్టీలైన వైసిపి, టిడిపిలు ప్రజా సమస్యలను విస్మరించి ఒకరినొకరిని తిట్టుకుంటూ వచ్చాయి. బూతులు తిట్టుకోవడం లేక రాళ్లు విసురుకునే రాజకీయాల దాకా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయి. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ఢిల్లీలో మోడీ ప్రభుత్వానికి తాకట్టు పెట్టి వారి పల్లకీ మోస్తూ రాష్ట్ర అభివృద్ధిని దెబ్బకొట్టడంలో ఇద్దరూ ఒకరికొకరు పోటీ పడుతున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలన్నదే వాళ్లకి పోటీ తప్ప, ఆంధ్రప్రదేశ్‌ను ఎలా అభివృద్ధి చేయాలన్నది కాదు. ఈ అసెంబ్లీలో సిపిఎం, సిపిఐ వంటి కమ్యూనిస్టు పార్టీలకు ప్రాతినిధ్యం లభిస్తే పైరెండు ప్రధాన పార్టీల తప్పుడు విధానాలను ఎండగట్టి ప్రజల తరపున ఒక మంచి ప్రశ్నించే గొంతుకను ఇచ్చిన వారవుతారు. ఈ ఎన్నికల్లో ఆ రకంగా మీరు సరైన నిర్ణయాన్ని తీసుకుని మా అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అరకు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న అప్పలనర్స మంచి విద్యావంతుడు. పార్లమెంట్‌లో గిరిజన హక్కుల కోసం పోరాడగల దిట్ట. రంపచోడవరం నుంచి లోతా రామారావు, కురుపాం నుంచి మండంగి రమణ, గాజువాక నుంచి మరడాన జగ్గునాయుడు, విజయవాడ సెంట్రల్ నుంచి సిహెచ్.బాబూరావు, మంగళగిరి నుంచి జొన్నా శివశంకరరావు, గన్నవరం నుంచి కె.వెంకటేశ్వరరావు, నెల్లూరు నుంచి మూలం రమేష్, పాణ్యం నుంచి గౌస్ దేశాయ్ సిపిఎం తరపున పోటీ చేస్తున్నారు. వారందరికీ అక్కడి ప్రజలు ఓట్లు వేసి అసెంబ్లీలో బలమైనటువంటి ప్రశ్నించే గొంతుకను, ప్రజల తరపున పోరాడే ధీరులను చట్టసభలకు పంపాలని కోరుతున్నాను. మిగతా నియోజకవర్గాలకు సంబంధించి సిపిఐ గుంటూరు పార్లమెంట్ సహా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, తెనాలి నియోజకవర్గంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పోటీ చేస్తున్నాయి. ఆ అభ్యర్థులను ఇండియా వేదిక బలపరుస్తోంది. మిగతా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బలపర్చాలని ఇండియా వేదిక తరపున నిర్ణయించాం. ఇండియా వేదికకు విజయం చేకూర్చాలని, తద్వారా దేశ రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని యావన్మంది రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇది మానవాళిపై దాడి


- ఐరాస మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్య
- మిస్టర్ నెతన్యాహు! బాంబింగ్‌తో హీరో కాలేవు: గుస్తావో పెట్రో



రఫా: దక్షిణ గాజా నగరమైన రఫాపై పూర్తి స్థాయి దాడికి ఇజ్రాయిల్ పూనుకోవడమంటే అంతర్జాతీయ చట్టాలను కాలరాయడమేనని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ చీఫ్ వోల్కర్ టర్క్ విమర్శించారు. అంతర్జాతీయ వ్యతిరేకతను ఖాతరు చేయకుండా తూర్పు రఫానుంచే గాక సెంట్రల్ రఫా నుంచి కూడా పాలస్తీనా పౌరులను నిర్దాక్షిణ్యంగా తరిమివేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంక్‌లు రఫాలో నివాస ప్రాంతాలను ధ్వంసం చేస్తున్నాయి. 3లక్షల మంది దాకా నిరాశ్రయులయ్యారు. అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో గాజాలోని 23 లక్షల మందికిగాను 85 శాతం మంది సొంత గడ్డమీదే శరణార్థులుగా మారారు. అక్కడి పరిస్థితిపై రఫా ప్రాంతవాసి 24 ఏళ్ల మహ్మద్ అమ్మద్ ఎఎఫ్‌పి వార్తా సంస్థతో మాట్లాడుతూ, ' గత కొన్ని రోజులుగా మేము నరకం అనుభవిస్తున్నాం.'అని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు లేవు, ఆహారం లేదు, మందులు లేవు, ఎక్కడికైనా వెళ్లిపోదామంటే వాహనాలకు ఇంధనం లేదు. అటు ఆకలి, ఇటు బాంబులతో పిల్లలు, మహిళలు, వృద్ధులు చనిపోతున్నారు. గడచిన 24 గంటల్లో 18 మృత దేహాలు ఆసుపత్రికి చేరినట్లు రఫా ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ రఫాపై దాడి చేస్తున్నందున ఆ దేశానికి ఆయుధాల ఎగుమతులను ఆపేయాలన్న డిమాండ్ అమెరికా, బ్రిటన్, ఇతర పశ్చిమ దేశాల్లో ఊపందుకుంటోంది. ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా నిలిపేయాలని బ్రిటన్‌లో లేబర్ పార్టీ డిమాండ్ చేసింది. రఫాపై దాడికి తాము వ్యతిరేకమే కానీ, ఆయుధాల ఎగుమతిని ఆపలేమని సునాక్ ప్రభుత్వం చెబుతోంది. ఆయుధాల సరఫరా మిగతా 2లో

కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ

- సభలు, సమావేశాలకు అడ్డంకులు
- ఎక్కడికక్కడ రాజకీయ కార్యకర్తల అరెస్టులు
- సిపిఎం నేత తరిగామిని సైతం అడ్డుకున్న పోలీసులు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. భారత రాజ్యాంగ కల్పించిన హక్కులను కేంద్రంలోని బిజెపి, దాని కనుసన్నల్లో పనిచేసే జమ్ముకాశ్మీర్ అధికార యంత్రాంగం పట్టపగలే కాలరాస్తున్నాయి. ప్రతిపక్ష పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, సిపిఎం, జెకె అప్నీ తదితర పక్షాల నాయకులను, కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. సభలు, సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే సిపిఎం నేత మహ్మద్ యూసుఫ్ తరిగామిని ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా అక్కడి అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతో పాటు పార్టీ కార్యకర్తలను కూడా అడ్డుకున్నారు. దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్‌లో రేబన్ జయాన్‌పోరాలో ఆదివారం ఎన్నికల ప్రచార సభ నిర్వహించాల్సివుండేది. అయితే శనివారం నుంచే ఆ ప్రాంతానికి సిపిఎం కార్యకర్తలను వెళ్లనీయకుండా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వైఖరిని తరిగామి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల వేళ రాజకీయ కార్యకర్తలను అరెస్టు చేయడమంటే ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించాల్సిన సభకు హాజరుకానివ్వకుండా తనను పోలీసులు అడ్డుకోవడం, పార్టీ కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఎన్నికల్లో పాల్గొనడం ప్రజల హక్కు అని, వాటిని రక్షించుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమనే విశిష్ట లక్షణమున్న భారత్‌లో ప్రజల భిన్నాభిప్రాయాలను గౌరవించడం అందరి బాధ్యత అని, ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకొని సభ నిర్వహించుకునే మిగతా 2లో

హద్దుమీరిన మత విద్వేష జాడ్యం

- ముస్లింలపై మళ్లీ మోడీ అక్కసు
- సిఎఎ అమల్జేసి తీరుతామని వెల్లడి
- ఫక్తు మతతత్వవాదిగా ప్రధాని ప్రచారం



కొల్‌కతా : మత విద్వేషజాఢ్యం హద్దులు మీరింది. సార్వత్రిక ఎన్నికలు మొదలైనప్పటి నుంచి ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విద్వేష ఆజ్యం పోస్తున్న బిజెపి అధినేతలు నాలుగో దశ పోలింగ్ ముందు రోజు మరింత విషం వెళ్లగక్కారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్రక్‌పుర్, హూగ్లీ ప్రాంతాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాలు ఫక్తు మతతత్వవాదిని తలపించాయి. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ని అమల్జేసితీరుతామని ఆయన పునరుద్ఘాటించారు. మోడీ బతికుండగా సిఎఎని ఎవ్వరూ రద్దు చేయలేరంటూ సవాళ్లు విసిరారు. దళితులు, ఆదివాసీలకంటే కొన్ని ప్రాంతాల్లో ముస్లింలే వెనుకబడివున్నారంటూ నివేదికలు ఘోషిస్తున్న నేపథ్యంలో పలు రాష్ట్రాలు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్నాయి. శషభిషలకు తావులేకుండా బిజెపి వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని మోడీ మరోమారు పునరుద్ఘాటించారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు తాము పూర్తి వ్యతిరేకమని ఆయన తేల్చిచెప్పారు. ఇటు ముస్లింలపై అక్కసు వెళ్లగక్కుతూనే మరోవైపు హిందూ ఓటర్ల సమీకరణ కోసం బెంగాల్ పర్యటనలోనూ మోడీ రామజపం చేశారు. 'మత ప్రాతిపదికన ఎవ్వరూ రిజర్వేషన్లు ఇవ్వలేరు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్ల జోలికి ఎవ్వరూ రాలేరు. శ్రీరామనవమి జరుపుకోవడాన్ని ఎవ్వరూ ఆపలేరు. రామమందిరంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడా రద్దు కాబోదు. సిఎఎ అమలును ఎవ్వరూ ఆపలేరు' అని మోడీ ప్రసంగం అసాంతం మత ప్రాతిపదికన ప్రజలను చీల్చేలా సాగింది. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా పౌరసత్వానికి మతం రంగు పులిమి తీసుకొచ్చిన సిఎఎను రద్దు చేయాల్సిన అవసరాన్ని ప్రతిపక్షాల ఐక్య వేదికలోని పలు పార్టీలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. సిఎఎను అమల్జేయబోమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఇప్పటికే ప్రకటించారు కూడా. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా బెంగాల్‌లో సిఎఎని అమల్జేయబోమని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధాని సిఎఎ అమలును ఎవ్వరూ ఆపలేరని ప్రకటించడం గమనార్హం.

నేరస్థులకు తృణమూల్ అండదండలు

సందేశ్‌ఖాలిలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసిన గూండాలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మమత బెనర్జీ రక్షిస్తున్నారని ఆయన విమర్శించారు. తృణమూల్ నేతలపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మహిళలను అధికార పార్టీ బెదిరింపులకు గురి చేస్తోందని, ఫిర్యాదులను వెనక్కి తీసుకునేలా ఒత్తిళ్ల పాల్పడుతోందని ఆయన పేర్కొన్నారు. తృణమూల్ పాలనలో బెంగాల్‌లోని హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మారిపోయారని ఆయన మత ప్రేరేపిత వ్యాఖ్యలు చేశారు. ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 'యువరాజు' రాహుల్ గాంధీ వయస్సు (53) కంటే తక్కువ సీట్లు వస్తాయని మోడీ జోస్యం చెప్పారు.

ఇసి తీరుపై ఇఎఎస్ శర్మ ఆందోళన



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం తన ఆదేశాన్ని ప్రాథమికంగా విస్మరించిందని భారత ప్రభుత్వ మాజీ సెక్రెటరీ ఎఎఎస్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. నిష్క్రియాత్మకత మన ప్రజాస్వామ్యం, సామాజిక సామరస్యానికి కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురు ఎలక్షన్ కమిషనర్లకు ఆయన లేఖ రాశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీతో సహా అధికార బిజెపి స్టార్ క్యాంపెయినర్ల ద్వేషపూరిత ప్రసంగాల మధ్య, ఎన్నికల సంఘం పోషించిన పాత్ర ఏమీ లేదని వివరించారు. ప్రధానంగా ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని ద్వేష పూరిత ప్రసంగాలు చేస్తూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించటంపై ఫిర్యాదులు నమోదవుతున్నప్పటికీ.. ప్రజాస్వామ్య పరిరక్షక ఇసి అనేక సందర్భాల్లో వ్యవహరించిన తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు.



విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి తమకు కేటాయించిన ప్రాంతానికి ఎన్నికల మెటీరియల్‌తో వెళ్తున్న సిబ్బంది



విశాఖలోని ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ నుంచి తనకు కేటాయించిన ప్రాంతానికి ఎన్నికల సామగ్రితో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఇక్కట్లు

- భోజనంలేక ఇబ్బందులు
- సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రితో ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఎండ తీవ్రత వల్ల నెల్లిమర్లలో ఒక పోలింగ్ ఆఫీసర్, జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కళాశాల కేంద్రంలో ఒక ఉద్యోగి సొమ్మసిల్లి పడిపోయారు. వారిని 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. నెల్లిమర్ల నుంచి భోగాపురం మండల కేంద్రానికి సిబ్బంది వెళ్తున్న బస్సు విజయనగరంలో రెండు గంటలపాటు నిలిచిపోయింది.

దీంతో వేరే బస్సు కోసం సిబ్బంది వేచి ఉండాల్సి వచ్చింది. బొబ్బిలి నియోజకవర్గ కేంద్రంలో 1700 మంది సిబ్బందికి రెండు కౌంటర్లు మాత్రమే ఏర్పాటు చేయడం వల్ల భోజనాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ సామగ్రి తీసుకునేందుకు సుమారు 1500 మంది సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్నారు. వారికి సరైన భోజన ఏర్పాట్లు చేయక పోవడంలో అధికారులు విఫలమయ్యారు. మధ్యాహ్నం 12:30లకే భోజనాలు అయిపోవడంతో సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఏలూరులోని సామగ్రి పంపిణీ కేంద్రంలో భోజనం కోసం ఖాళీ పేట్లతో ఎదురుచూస్తున్న సిబ్బంది

భోజనం ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ మాత్రం తమకు తక్కువ సంఖ్య చెప్పారని, ఇప్పుడు ఎక్కువ మంది వచ్చి భోజనం చేశారని, అందుకే కూరలు సరిపోలేదని తెలిపారు. రిటర్నింగ్ అధికారిగానీ, ఇతర సిబ్బందిగానీ అటువైపు రాకపోవడం గమనార్హం. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో సరైన భోజనం అందక పోవడంతో పోలింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీ ప్లేట్లతో సిబ్బంది క్యూ లైన్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. మరోసారి భోజనం రప్పించి అరకొరగా వడ్డించారు. దీంతో పోలింగ్ సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు.



విశాఖలోని ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ నుంచి తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి చంటి బిడ్డతో సహా సిద్ధంగా ఉన్న మహిళ

ధన... మద్య ప్రవాహాలు

- బహిరంగంగా పంచుతున్న వైసిపి, ఎన్‌డిఎ కూటమి నాయకులు
- చోద్యం చూసిన ఎన్నికల అధికారులు, పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ధనం, మద్యం ప్రవాహం యథేచ్ఛగా సాగుతోంది. గతం రికార్డులను తలదన్నే విధంగా లారీలు, వ్యాన్లలో కోట్ల కొలది డబ్బు రవాణా అవుతోంది. ప్రమాదాలు జరిగి, వ్యానులు బోల్తాపడితేనే కోట్లు దొరికాయి. ఇక దొరకని డబ్బు ఎన్నివేల కోట్లు రవాణా అయిందో లెక్కలేదు. పెద్దఎత్తున తనిఖీలు చేసినా డబ్బు రవాణా మాత్రం ఆగలేదు. ఈ ఎన్నికల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి, టిడిపి కూటమి తరపున అత్యధిక నియోజకవర్గాల్లో అభ్యర్థి రూ.30 కోట్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల వరకూ ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు చర్చ నడుస్తోంది.

ప్రచారం ముగిసిన శని, ఆదివారాల్లో డబ్బు పంపిణీ ఇష్టారాజ్యంగా సాగింది. ఓటుకు రెండువేల రూపాయలు నుండి ఐదువేల రూపాయలు వరకూ పంచుతున్నారని ప్రచారం వుంది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు కూడా పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రయాణంలో ఎన్నో తిప్పలు పడ్డారు. అయితే డబ్బు పంపిణీని అడ్డుకునే పోలీసు, అధికార యంత్రాంగం ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో గతంలో జరిగిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఈసారి ధన, మద్య రాజకీయం సాగింది. పూర్తిగా డబ్బు చుట్టూ రాజకీయాన్ని తిప్పారు. మరోవైపు డబ్బు పంపిణీలో పెద్దఎత్తున ఘర్షణలు కూడా చోటు చేసుకున్నాయి. కొన్నిచోట్ల పంపిణీ సరిగా జరగలేదని, కొన్నిచోట్ల రెండు పార్టీల నాయకుల మధ్య ఇలా పరస్పరం ఘర్షణలు జరిగాయి. తలలు పగలకొట్టుకున్నారు. ఇంతకుముందు ఎన్నికల రోజు ఘర్షణలు జరిగేవి, ఇప్పుడు డబ్బు పంపిణీ రోజే ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ప్రత్యేక పరిస్థితి

ఈసారి కొన్నిచోట్ల ద్వితీయశ్రేణి నాయకత్వంలో ప్రత్యేక పరిస్థితి కనిపించింది. పలు డివిజన్లలో వైసిపి, టిడిపి కూటమి నాయకులు కొత్త ఎత్తుగడ వేశారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత సిబ్బందిని, కంపెనీల సిబ్బందిని డబ్బు పంపిణీకి పంపించడంతో రెండు పార్టీల నాయకులు కూడబలుక్కుని ఎక్కడ డబ్బు పంపిణీ చేస్తున్నారో అక్కడ ఘర్షణ సృష్టించి మొత్తం డబ్బు వారే తీసుకుపోయారు. వైసిపి వాళ్లు పంచుతుంటే టిడిపి వాళ్లు వెళ్లి గొడవ చేయడం అభ్యర్థి తరుపున తీసుకొచ్చిన డబ్బు లాక్కుని వెళ్లిపోవడం, టిడిపి వాళ్లు వెళ్లి పంచుతుంటే వైసిపి వాళ్లు గొడవ చేయడం డబ్బు లాక్కుని వెళ్లిపోవడం వంటి ఘటనలు జరిగాయి. ఎక్కువచోట్ల డబ్బు పంపిణీ చేయకుండానే వారి కార్యకర్తలతో పలానా చోట డబ్బు పంపిణీ అని ప్రచారం చేయడం, అక్కడకు వెళ్లగానే పోలీసులు వచ్చారని చెప్పి తిప్పి పంపించడం వంటి చర్యలు జరిగాయి.

చెక్‌పోస్టులున్నా...

నోటిఫికేషన్ వచ్చిన తరువాత అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. ఒకటి రెండు రోజులు హడావిడి చేసినా మిగిలిన రోజుల్లో ఎక్కడా తనిఖీలు జరగడం లేదు. ఎక్కడికక్కడ లారీల్లో డబ్బు దొరకడమే ఇందుకు నిదర్శనం. ఈసారి ఎన్నికల సంఘం సిబ్బంది పూర్తిగా చేతులెత్తేశారు.

వామపక్ష నాయకులు కళాకారులకు కొన్న డ్రస్సులను సీజ్ చేసిన ఎన్నికల అధికారులు కోట్ల రూపాయలు, వందల కోట్ల ప్రైజులు పంపిణీ చేస్తుంటే చేతులెత్తేశారు. గతంలో ఎక్కడన్నా హడావుడి జరుగుతుందంటే పోలీసులు వచ్చి తనిఖీలు చేసి పంపించేసేవారు. ఈసారి అటువంటి పరిస్థితి లేదు.

ప్రజా రాజకీయం చేసిన వామపక్షాలు

రాష్ట్రంలో డబ్బు, మద్యం ప్రవాహం యథేచ్ఛగా సాగుతున్నా వామపక్ష పార్టీల అభ్యర్థులు మాత్రం ఎక్కడా ధన ప్రస్తావన చేయలేదు. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం, రక్షణ కోసం చేసిన పోరాటాలు, ఆందోళనలు గురించి చెప్పి ఓట్లు అడుగుతున్నారు. ప్రజల ముందుకు వెళ్లి ధైర్యంగా తమకు ఓటు వేయాలని కోరుతున్నారు.

విశాఖలో రూ.కోటిన్నర నగదు పట్టివేత

సార్వత్రిక ఎన్నికల వేళ విశాఖ నగరంలో భారీగా నగదు పట్టుబడింది. ఆర్‌కే బీచ్‌కు సమీపంలోగల పాండురంగాపురంలో రూ.కోటిన్నర నగదును జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. కొందరు వ్యక్తులు నగదును కారులో తరలిస్తున్నట్లు సి విజిల్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. బీచ్ రోడ్డులో తనిఖీలు చేపట్టగా కారులో నగదును విడిచిపెట్టి నిందితులు పరారయ్యారు. ఆ మొత్తాన్ని సీజ్ చేసిన అధికారులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.





విశాఖలో పట్టుబడ్డ కారు, నగదు

నోటు కోసం రోడ్డెక్కిన ఓటరు !

- గన్నవరం, గుడివాడ వైసిపి కార్యాలయాల వద్ద నిరసన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రజలకు ఆదర్శవంతంగా ఉండాల్సిన రాజకీయ పార్టీల నేతలు అడ్డదారుల్లో గెలవడానికి తెగిస్తున్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలను డబ్బులు పంచే పండుగగా మార్చేశాయి. పోలింగ్‌కు ముందు డబ్బులు అందకుంటే ఓటరు రోడ్డెక్కె పరిస్థితిని తీసుకొచ్చాయి. కృష్ణాజిల్లా గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన ఈ ఘటనలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి, టిడిపిలు ఓటుకు రూ.3 వేలు చొప్పున, అలాగే గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార వైసిపి రూ.3 వేలు, ప్రతిపక్ష టిడిపి రూ.2,500 చొప్పున పంపిణీ చేశాయని ఆరోపణలున్నాయి. తమకు ఓటు వేయరని నిర్ధారించుకున్న కొందరు ఓటర్లకు ఆయా నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల నేతలు నగదు పంపిణీ చేయలేదని తెలిసింది. ఎక్కువ మొత్తం నగదు పంపిణీ చేయడం, ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో కొందరు ఓటర్లు గన్నవరం, గుడివాడల్లోని వైసిపి కార్యాలయాలకు చేరుకున్నారు. ఆయా కార్యాలయాల్లోని నేతలు డబ్బు పంపిణీ నిలిపివేశామని చెప్పడంతో ఆగ్రహం చెందారు. దీంతో గన్నవరంలోని వైసిపి కార్యాలయం వద్ద రెండు సామాజిక తరగతులకు చెందిన ఓటర్లు నిరసన తెలిపారు. వారికి అధికార పార్టీ నేతలు సర్ది చెప్పి తిప్పిపంపినట్లు తెలిసింది.

హిందూపురంలో దారుణం

- భార్య, అత్త, చిన్నత్తపై వేటకొడవలితో దాడి

ప్రజాశక్తి-హిందూపురం

భార్యను తనతో పంపకుండా అడ్డుకుంటున్నారన్న కారణంతో అత్త, చిన్నత్తపై వేటకొడవలితో అల్లుడు దాడి చేశాడు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పది సంవత్సరాల క్రితం మీనా, నవీన్ కుమార్‌రెడ్డిలు కులాంతర వివాహం చేసుకున్నారు. కొంతకాలం తర్వాత మద్యానికి నవీన్‌కుమార్‌రెడ్డి బానిసయ్యాడు. భార్యతో తరుచూ గొడవపడుతుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయారు. విడాకుల కోసం ఆమె కోర్టును ఆశ్రయించారు. తాగుడు మానేస్తానని భార్య పిల్లలను బాగా చూసుకుంటానని అత్తమామతో చెప్పడంతో కూతురిని అల్లుడితో పంపారు. నవీన్‌కుమార్‌రెడ్డి మళ్లీ మద్యానికి బానిసవ్వడంతో మీనా మళ్లీ తన పుట్టింటికి వచ్చారు. తనతో పంపకుండా అత్త కుర్మిని, చిన్నత్త రాజమ్మ అడ్డుకుంటున్నారని భావించి శనివారం అర్ధరాత్రి తన భార్య ఇంటికి నవీన్‌కుమార్‌రెడ్డి వెళ్లాడు. మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో వేట కొడవలితో భార్య, అత్త, చిన్నత్తపై నవీన్ దాడి చేశాడు. ఈ దాడిలో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడడంతో వారిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానికులు చేర్పించారు. రాజమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉక్కు' పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా కార్మికవర్గం పోరాడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1186వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులు, ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి రామచంద్రరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించుకోవడానికి, దేశాభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవటం ఎంతైనా అవసరమని అన్నారు. ఈ ఎన్నికల్లో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించే నాయకులకే ఓటు వేసి కార్మికులు గెలిపించుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. మున్ముందు జరిగే పోరాటాల్లోనూ కార్మికవర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియా వేదిక భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని, రాష్ట్రంలో ధన రాజకీయాలను తిరస్కరించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాష్ట్ర ప్రజానీకానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకమైనవని, దేశ భవిష్యత్, అభివృద్ధి, గమ్యాన్ని నిర్ణయించే ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని మోడీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కాంక్షతో మరోమారు మతన్మోదాన్ని నెత్తినెత్తుకుని, తద్వారా ఓటర్లను మత ప్రాతిపదికన చీల్చి మూడోసారి అధికారం చేపట్టాలని విశ్వప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక, మైనింగ్, మద్యం కుంభకోణాల ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బులతో మరోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని, గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి అటకెక్కిందని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని, డబ్బు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయాలనుకునే పార్టీలకు తగిన బుద్ధి చెప్పి, ఓటు విలువ గుర్తించేలా చేయాలని ఆయన కోరారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి, లౌకికవాదాన్ని పరిరక్షించడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి దేశవ్యాప్తంగా 28 రాజకీయ పార్టీలు ఇండియా వేదికగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని, ఎపిలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలు వేదిక పార్టీలుగా ఐక్యంగా పోటీ చేస్తున్నాయని, ఆ పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేసి, గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రామకృష్ణ కోరారు.

అల్లర్లు జరగకుండా భారీ బందోబస్తు

- నలుగురు సీనియర్ అధికారులతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తూ ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఏకపక్షంగా పనిచేస్తున్న పలువురు ఐపిఎస్‌లను బదిలీ చేసిన ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో సమస్యాత్మక నియోజకవర్గాల్లో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు మొత్తం 1.06 లక్షల మంది పోలీసులను వినియోగిస్తోంది. అలాగే రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నలుగురు సీనియర్ పోలీస్ అధికారులను పర్యవేక్షకులుగా నియమిస్తూ ఆదివారం రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ డిజిపి అతుల్ సింగ్‌ను తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యవేక్షకులుగా నియమించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా జిల్లాలకు సెబ్ కమిషనర్ ఎం రవిప్రకాష్‌ను, ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ కమిషనరేట్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు అక్టోపస్ ఐజి సిహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. అలాగే న్యాయపరమైన అంశాలకు డిఐజి గోపినాథ్ జెట్టీని నియమించారు.

ఢిల్లీలో ఆసుపత్రులకు బాంబు బెదిరింపు



న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో మళ్లీ కలకలం రేగింది. కొద్ది రోజులుగా బాంబు బెదిరింపు మెయిల్స్ ఢిల్లీలో అలజడి రేపుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం పలు ఆసుపత్రులకు ఇలాంటి బెదిరింపులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఢిల్లీలోని బురాయి, సంజయ్ గాంధీ ఆసుపత్రులు సహా పది హాస్పిటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయని పేర్కొన్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. అయితే.. అక్కడ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదని చెప్పారు. ఇటీవల 150కి పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలన్నింటికీ ఒకే ఐపి అడ్రస్ నుంచి మెయిల్స్ వచ్చాయి. చివరకు పోలీసుల తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు దొరక్కపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గట్టి చర్యలు తీసుకోండి : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట అల్లర్లకు కుట్రలు చేస్తున్నట్లు తమకు సమాచారం వుందని, ఎన్నికల కమిషన్ పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి ఎన్నికల ఏజెంట్ల ద్వారా పోలింగ్ కేంద్రాల్లో అల్లర్లకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అలాగే ఎన్నికల నిబంధనావళిని చంద్రబాబు ఉల్లంఘించారని, ఆయనపై ఇసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణ మూర్తి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఇప్పటి వరకు 230 ఫిర్యాదులు ఇచ్చినా స్పందించని ఎన్నికల కమిషన్ టిడిపి ఏ చిన్న ఫిర్యాదు చేసినా ఎలాంటి కారణాలు లేకుండా చర్యలు తీసుకుంటూ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

తుది సమరం నేడే

(మొదటి పేజీ తరువాయి)

జరిగే ఓటింగ్ సరళిని పోలింగ్ కేంద్రంలో, బయట కూడా ఈ దఫా ఈసి నేతృత్వంలో 150 మంది అధికారులు, సిబ్బందిని ఇసి నియమించింది.

83 శాతం ఓటింగ్ లక్ష్యంగా చర్యలు : సిఇఒ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న పోలింగులో ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు, ధృడమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటుకు ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరగడం ఎంతో కీలకమన్నారు. గత ఎన్నికల్లో 79.84 శాతం ఓటింగ్ నమోదైందని, ఈ దఫా ఎన్నికల్లో 83 శాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృత స్థాయిలో ఓటర్లను చైతన్యపరిచేలా పలు స్వీప్ కార్యక్రమాలు పెద్దయెత్తున నిర్వహించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన తాగునీరు, వీల్ చైర్లు, ర్యాంపులు, ప్రథమ చికిత్స సేవలు అందుబాటులో ఉంచామని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు సిఇఒ తెలిపారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఓటర్లను ఎవరైనా అడ్డుకున్నా, చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై మార్కు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరగని సిరా కేంద్ర ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని, మరెవరికీ అందుబాటులో ఉండదని అన్నారు.

కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ హక్కును కాపాడాలని తరిగామి విన్నవించారు.

రిగ్గింగ్ జరక్కుండా చూడండి : మెహబూబా ముఫ్తీ

1987 తరహా రిగ్గింగ్ జరక్కుండా చూడాలని, ఓటర్ల అరెస్టులు ఆపాలని భారత ఎన్నికల సంఘానికి జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షులు మెహబూబా ముఫ్తీ కూడా లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న రాష్ట్ర అధికారులు ఓటర్లను, పిడిపి మద్దతుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పుల్వామా, షోపియాన్ జిల్లాల్లో భద్రతా దళాలు సోదాలు నిర్వహించి, పిడిపి కార్యకర్తలను వేధిస్తున్నారన్న కథనాలు తీవ్ర ఆందోళనకు గురైనట్లు లేఖలో ఆమె తెలిపారు. అనంతనాగ్-రాజౌరీ ఎన్నికను వాయిదా వేయడం వంటి చర్యలు ఇసి నిష్పాక్షికతపై ఆందోళనలు లేవనెత్తుతున్నాయిని, అదేవిధంగా బెదిరింపులు, దౌర్జన్యం ద్వారా ఎన్నికల ఫలితాలను మార్చడానికి ప్రయత్నించే వారికి ధైర్యం కలిగిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు, శ్రీనగర్, బుద్గాం, పుల్వామా, షోఫియాన్‌ల్లోని వివిధ ప్రాంతాల్లో జెకె అప్నా పార్టీ కార్యర్తలను పోలీసులు పెద్ద సంఖ్యలో అరెస్టు చేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రఫీ అహ్మద్ మీర్ తెలిపారు. 'ఎన్నికలకు కేవలం కొన్ని గంటల ముందు పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడం ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఈ అన్యాయాన్ని మేం సహించం, ఎన్నికలను బహిష్కరిస్తాం' అని మీర్ తెలిపారు

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్గొండ జిల్లా దేవరకొండలో 48 మంది ఉద్యోగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో.. ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గైర్హాజరైన ఉద్యోగులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాగా,సోమవారం పోలింగ్ జరగనున్న తరుణంలో దేవరకొండకు అదనపు పోలీసులు, కేంద్ర బలగాలు పంపాలంటూ ఎన్నికల సంఘానికి బిఆర్‌ఎస్ లేఖ రాసింది. కాంగ్రెస్ ఇక్కడ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

ఇది మానవాళిపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆపడమంటే హమాస్‌కు బలం చేకూర్చడమేనని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కెమరాన్ అన్నారు.

నిన్ను నరహంతకుడిగానే చరిత్ర చూస్తుంది: గుస్తావో పెట్రో

గాజాలో పెద్దయెత్తున మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై కొలంబియా తొలి వామపక్ష అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'మిస్టర నెతన్యాహు! వేలాది మంది అమాయక పౌరులపై బాంబులేసి చంపడం హీరోయిజం అనిపించుకోదు. చరిత్ర నిన్ను నరహంతకుడిగానే చూస్తుంది. ఐరోపాలో లక్షలాది మందిని చంపిన ఫాసిస్టు హిట్లర్‌కు, మీకు తేడా లేదు' అని పెట్రో విమర్శించారు. అంర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పెట్రో మాట్లాడుతూ, 'పాలస్తీనా దేశాన్ని మొత్తంగా తుడిచేసేందుకు ఇజ్రాయిల్ పాల్పడుతుంటే మనం చేష్టలుడిగినట్లు కూర్చోలేం. పాలస్తీనా అదృశ్యమవడం అంటే మానవాళి కనుమరుగవడంతో సమానం. అందుకే దురాక్రమణదారు అయిన ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను పూర్తిగా తెగదెంపులు చేసుకున్నాం ' అని చెప్పారు.

ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకున్న రెండవ లాటిన్ అమెరికా దేశం కొలంబియా. అంతకుముందు బొలీవియా ఈ పని చేసింది. కొలంబియా తరువాత హోండూరస్, మెక్సికో సమీపంలోని బెలిజ్ కూడా ఇదే బాటలో నడిచాయి.

హిట్లర్‌ను తలపిస్తున్న నెతన్యాహు: ఎర్డోగన్

హిట్లర్ అనుసరించిన క్రూరమైన పద్ధతులనే నెతన్యాహు పాలస్తీనీయుల ఊచకోతకు అనుసరిస్తున్నాడని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ విమర్శించాడు.

గతంలో హిట్లర్ గ్యాస్ చాంబర్‌లోపెట్టి వేలాది మంది అమాయక పౌరులను సామూహికంగా చంపడం, యూదులు నివసించే ప్రాంతాలను దిగ్బంధించి వారికి నీరు, ఆహారం, మందులు, ఇంధనం అందకుండా చేయడం ద్వారా వారు ఆకలితో చనిపోయేలా చేశాడు. ఇప్పుడు నెతన్యాహు అవే పద్ధతులను అనుసరిస్తున్నాడని అన్నారు.

విద్యార్థుల ఉద్యమం విస్తరణకు యత్నాలు

గాజాకు సంఘీభావంగా అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఏప్రిల్ 18న ప్రారంభించిన గుడారాల ఉద్యమం దావానలంలా వ్యాపించి అనతి కాలంలోనే 80 యూనివర్సిటీలకు విస్తరించింది. అటు నుంచి ప్రపంచ నలుమూలలకూ పాకింది. విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన ఈ ఉద్యమం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకున్నా అమెరికా ప్రభుత్వం, యూనివర్సిటీల యాజమాన్యాలు హింసాత్మక పద్ధతుల్లో ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు యత్నిస్తున్నాయి.

విద్యార్థులు ప్రారంభించిన ఈ సంఘీభావ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన కొత్త మార్గాల గురించి ప్రొఫెసర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది దృష్టి సారించారు. మే8న మొదటి ఫ్యాకల్టీ నిరసన గుడారాలన్ని న్యూయార్క్ సిటీలో ది న్యూ స్కూల్ ఫ్యాకల్టీ ప్రారంభించారు. రిటైర్డు టీచర్లు కూడా వీరికి మద్దతుగా ముందుకొస్తున్నారు. నార్త్ కరోలినా నుండి కాలిఫోర్నియా వరకు కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్నాతకోత్సవాల్లో గాజాలో ఇజ్రాయిల్ దుర్మార్గాలను నిరసిస్తూ కొందరు నినదించారు. వర్జీనియాలోని కామన్వెల్త్ యూనివర్సిటీలో డజన్ల కొద్దీ విద్యార్థులు గాజాకు సంఘీభావంగా గొంతెత్తారు.

ఇజ్రాయిల్ ఊచకోతపై ఐసిజెలో ఈజిప్టు కేసు

గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడడం ద్వారా అంతర్జాతీయ చట్టాన్ని బాహాటంగా అతిక్రమించిందని ఈజిప్టు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా నెతన్యాహును యుద్ధ నేరస్తునిగా ప్రకటించాలని కోరుతో ఒక పిటిషన్ వేసింది. ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు రఫాలోను, ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపైన దాడులను ఉధృతం చేసిన నేపథ్యంలో ఈజిప్టు ఈ చర్య తీసుకుంది. హమాస్‌పై పోరు పేరుతో అమాయక పౌరుల ప్రాణాలను బలిగొంటున్న నెతన్యాహు దురాగతాలపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ప్రభుత్వాలు మాత్రం ఇజ్రాయిల్‌కు మద్దతు కొనసాగిస్తూనే ఉన్నాయి.



మృతి చెందిన మాదాసు రాణి

కూతురును నరికి చంపిన కన్న తండ్రి

ప్రజాశక్తి-ఐ.పోలవరం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అనుమానంతో కూతురును కన్న తండ్రే నరికి చంపిన ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పాతఇంజరంలో కౌలు రైతు మాదాసు శివ సుబ్రహ్మణ్యం కుటుంబం ఉంటోంది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆదివారం చిన్న కుమార్తె, కుమారుడు బయటకు వెళ్లారు. అదే సమయంలో పెద్ద కుమార్తె మాదాసు రాణి (27)పై తండ్రి సుబ్రహ్మణ్యం కత్తితో దాడి చేశాడు. మెడ పైన, భుజంపైన నరికాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె మరణించారు. సుబ్రహ్మణ్యం పోలీసులకు లొంగిపోయాడు. కుమార్తెపై అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఎస్ఐ జె భాను ప్రసాద్ తెలిపారు.

ఒకరిని రక్షించబోయి మరొకరు

- చెరువులో పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

చెరువులో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిర్లంగి గ్రామానికి చెందిన కొంత మంది సమీపంలో ఉన్న చెరువులో స్నానం చేస్తున్నారు. సబితా (49) అనే మహిళ స్నానం చేస్తుండగా గుంతలోకి జారుకుంది. కాపాడంటూ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న దూపాన భైరి (75) ఆమెను కాపాడేందుకు చెరువులో దూకి ఆయన కూడా చిక్కుకున్నారు. కొందరు గ్రామస్తులు గమనించి ఇద్దరినీ ఒడ్డుకి తీసుకొచ్చారు. ప్రయివేటు వాహనంలో ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భైరి



సమితా రౌళో

బిఎస్ఎన్ఎల్‌లో 2 కొత్త ప్రీపెయిడ్ ప్లాన్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ రెండు కొత్త ప్రీ పెయిడ్ ప్లాన్లను తీసుకొచ్చింది. వీటిలో ఒకటి డేటా వోచర్ కాగా.. మరొకటి వ్యాలిడిటీ పొడిగింపు ప్లాన్. వీటి ధరలు వరుసగా రూ.58, రూ.59.

రూ.58 ప్లాన్ పూర్తి వివరాలు

బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న రూ.58 ప్లాన్ ఒక డేటా వోచర్. దీన్ని పొందాలంటే కచ్చితంగా ఒక యాక్టివ్ బేస్ ప్లాన్ ఉండాల్సిందే. దీని వ్యాలిడిటీ ఏడు రోజులు. ప్రతిరోజూ 2 జిబి డేటా లభిస్తుంది. పూర్తి డేటా అయిపోయిన తర్వాత వేగం 40 కెబిపిఎస్‌కు తగ్గిపోతుంది.

రూ.59 ప్లాన్ పూర్తి వివరాలు

రూ.59 ప్లాన్ వ్యాలిడిటీ ఏడు రోజులు. ఎస్ఎంఎస్ ప్రయోజనాలుండవు. రోజుకు 1 జిబి డేటా లభిస్తుంది. అపరిమిత వాయిస్ కాలింగ్ ఉంటుంది. బిఎస్ఎన్ఎల్ ఈ ఏడాది ఆగస్టు నుంచి దేశ వ్యాప్తంగా 4జి సేవలను ప్రారంభించనుందని అధికారిక వర్గాలు ఇటీవల తెలిపాయి. 4జి సేవలకు పూర్తిగా స్వదేశీ సాంకేతికతనే సంస్థ ఉపయోగించనుంది. ప్రయోగాత్మక దశలో 700 – 2,100 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో రూపొందించిన 4జి నెట్‌వర్క్‌లో, 40–45 ఎంబిపిఎస్ డేటా వేగాన్ని నమోదు చేసినట్లు బిఎస్ఎన్ఎల్ అధికారులు వెల్లడించారు.

షిప్‌యార్డ్ కాంట్రాక్టు ఎల్&టి కి!

- ఎఫ్ఎస్ఎస్‌ల్లో 2 నౌకల నిర్మాణ పనులు అప్పగించే యత్నం?
- హెచ్ఎస్ఎల్ మనుగడపై ప్రభావం
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్కించుకున్న రూ.19 వేల కోట్ల 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల కాంట్రాక్టును యాజమాన్యం దొడ్డిదారిన ఎల్అండ్‌టి ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయాలని చూస్తోంది. ఓ పక్క దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సాగుతుండగా సందట్లో సడేమియా అన్నట్టుగా సుమారు రూ.8200 కోట్ల విలువైన రెండు షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. 2014లోనే షిప్‌యార్డుకు దక్కాల్సిన 5 ఎఫ్ఎస్ఎస్‌ల కాంట్రాక్టును కేంద్రంలోని బిజెపి ఇవ్వనిరాకరించింది. ఎట్టకేలకు 2023లో దీన్ని హిందుస్థాన్ షిప్‌యార్డు సాధించగలిగింది. పదేళ్ల తర్వాతైనా షిప్‌యార్డుకు ఆర్డర్లు దక్కినందుకు ఉద్యోగులు, కార్మికులు సంతోషించారు. వాస్తవానికి 2010లోనే రక్షణ అవసరాల నిమిత్తం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ విశాఖ హెచ్ఎస్ఎల్‌ను తన అధీనంలోకి తీసుకుంది. ఎఫ్ఎస్ఎస్, ఎల్‌పిడి, పి 751 సబ్‌మెరైన్‌ల వర్క్ ఆర్డర్లను నామినేషన్ పద్ధతిలో ఇస్తామని కేంద్రం ఆనాడే హామీ ఇచ్చింది. ఆ తర్వాత కేవలం 11184 షిప్‌ను మాత్రమే నామినేషన్ పద్ధతిలో కేటాయించింది. ఆ తర్వాత అన్నీ బహిరంగ మార్కెట్‌లో టెండర్ల ద్వారా పోటీపడేలా హిందుస్థాన్ షిప్‌యార్డును బిజెపి సర్కారు వదిలేసింది. 5 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని సకాలంలో ప్రారంభించలేదు. వీటి నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి షిప్‌యార్డు రూ.వందల కోట్లు రుణం తెచ్చింది. దీనికి ఏడాదిన్నరగా వడ్డీలు కడుతూ అప్పుల్లోకి వెళ్లిపోయినట్టు సమాచారం. దీన్ని సాకుగా చూపించి తాజాగా 2 నౌకల నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టికి ఇచ్చేయాలని, నాలుగో దశ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నిర్ణయం పట్ల షిప్‌యార్డు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.



టెండర్ల ప్రక్రియ ఎలా ఉండబోతుంది?

రూ.8200 కోట్ల విలువైన 2 ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణాన్ని నేరుగా ఎల్అండ్‌టికి ఇచ్చేస్తే విమర్శలు వస్తాయని భావించిన షిప్‌యార్డు యాజమాన్యం కొచ్చిన్ షిప్‌యార్డును 'డమ్మీ'గా పిలిచేందుకు రంగం సిద్ధం చేసింది. నేరుగా ఒక ప్రయివేట్ కంపెనీకి షిప్‌యార్డులోని షిప్‌ల నిర్మాణ బాధ్యతలను ఇవ్వకూడదన్న నిబంధన వల్ల కొచ్చిన్ షిప్‌యార్డుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంట్రీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో షిప్‌యార్డు యాజమాన్యం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. కేంద్రం ఇంతలా ఉత్సాహం చూపడానికి కారణమూ లేకపోలేదు. ప్రధాని మోడీ సన్నిహితుడైన కార్పొరేట్ అదానీ... దేశంలోని కొచ్చిన్ షిప్‌యార్డులోకి ఇదివరకే 'అదానీ హార్బర్ సర్వీసెస్ లిమిటెడ్' పేరుతో ప్రవేశించారు. దేశంలోని మేజర్ పోర్టులన్నిట్లోనూ అదానీ పోర్ట్స్ హార్బర్ సర్వీసెస్ తయారు చేసే గ్రీన్ టగ్లను వాడాలన్న నిబంధనను కేంద్రం 2023లోనే పెట్టింది. ఈ మేరకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నౌకల నిర్మాణ వ్యవహారాల్లో అదానీ గ్రూప్‌తో ఎంఒయు కూడా చేసుకున్నందున 5 ఎఫ్ఎస్ఎస్‌ల్లో ప్రస్తుతం రెండింటికి, తర్వాత మిగతా మూడింటికీ ఎసరొచ్చే ప్రమాదం ఉంది. ఈ దృష్ట్యా 2024లో నికర లాభ లక్ష్యం రూ.1000 కోట్లు షిప్‌యార్డుకు రాదన్నది స్పష్టమవుతోంది. దీంతో, షిప్‌యార్డు ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మొత్తంగా 5 ఎఫ్ఎస్ఎస్‌లు నిర్మిస్తే వచ్చే రూ.19 వేల కోట్ల టర్నోవర్ సొమ్మును ప్రయివేట్ కార్పొరేట్ దోచుకోనున్నారనే చర్చ సాగుతోంది. ఎల్అండ్‌టికి ఇచ్చే రెండు షిప్‌ల నిర్మాణ టెండరు వ్యవహారంపై పోరాడేందుకు షిప్‌యార్డు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి
- ముగ్గురికి గాయాలు



దేవి సంధ్య



జస్విత

ప్రజాశక్తి - గోపాలపట్నం (విశాఖపట్నం)

రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. ప్రకాశం జిల్లాలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి చెందారు. విశాఖపట్నంలో ఇద్దరు యువకులు మరణించారు. ఈ రెండు ఘటనలకు అతి వేగమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు సమాచారం మేరకు... విశాఖ కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఆరెల్లి పవన్ కుమార్ (23), దొండపర్తి ప్రాంతానికి చెందిన తానవరపు కుమార్ (24), తాటిచెట్ల పాలెంకు చెందిన గాంధీ ముగ్గురు స్నేహితులు కలిసి గాజువాక నుంచి నగరంలోకి ఎన్ఎడి జంక్షన్ మీదుగా బైక్‌పై వెళ్తున్నారు. ఎన్ఎడి ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి బైక్ వేగాన్ని అదుపు చేయలేకపోయారు. దీంతో డివైడర్‌ను బలంగా ఢీకొట్టి ఫ్లైఓవర్ పై నుంచి కింద పడిపోయారు. ఈ ఘటనలో పవన్ కుమార్ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కుమార్, గాంధీలకు తీవ్ర గాయాలవడంతో కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించి కుమార్ మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. సిఐ చక్రధరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్లకు చెందిన యాలవల వెంకటేశ్వర్లు, భారతి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరులోని ఒక మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో స్వగ్రామమైన బాపట్లలో ఓట్లు వేసేందుకు భార్యాభర్తలిద్దరూ ఒక బైక్‌పై, ముగ్గురు ఆడపిల్లలు, వెంకటేశ్వర్లు తమ్ముడు లక్ష్మయ్య మరో బైక్‌పై బాపట్లకు బయలుదేరారు. చినగంజాం రొంపేరు కాలువ వద్దకు వచ్చేసరికి పొన్నూరు వైపు నుండి ఒంగోలు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి పిల్లలతో ఉన్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దేవి సంధ్య (11), జస్విత (9) అక్కడికక్కడే మృతిచెందారు. మరో బాలిక అశ్విని, లక్ష్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని తల్లీకుమారుడు దుర్మరణం

- మృతుల్లో అంగన్‌వాడీ వర్కర్

ప్రజాశక్తి-కావలి రూరల్

ఎన్నికల విధులకు వెళ్తు రైలు ఢీకొని అంగన్‌వాడీ వర్కర్, ఆమె వెంట ఉన్న కుమారుడు దుర్మరణం చెందారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సైదాపురం మండలం, చాగణం గ్రామానికి చెందిన బట్టా సుభాషిణి (58) రాపూరు ప్రాజెక్ట్ చాగణం సెక్టార్‌లో అంగన్‌వాడీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెకు కావలిలో ఎన్నికల విధులు కేటాయించడంతో భర్త, కుమారుడు విజయ్ కుమార్ (28)తో కలిసి చాగాణం నుంచి గూడూరు రైలులో కావలికి సుభాషిణి బయల్దేరారు. కావలిలో రైలు దిగి ట్రాక్ దాటుతుండగా అదే ట్రాక్‌పై వస్తున్న రైలు సుభాషిణిని, ఆమె కుమారుడిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లీ కుమారులకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, షేక్ రెహనా బేగం డిమాండ్ చేశారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

తవణంపల్లి (చిత్తూరు జిల్లా): ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలంలో చోటుచేసుకుంది. అటవీ అధికారుల సమాచారం మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లె మండలం వెంగంపల్లె గ్రామానికి చెందిన పి.చిన్నయ్య (50) ఆదివారం ఉదయం కాలనీకి సమీపంలోని మామిడి తోటలో బహిర్భూమికి వెళ్లారు. ఏనుగును చూసిన కుక్కలు మొరిగాయి. దీంతో చిన్నయ్య అటుగా వెళ్లగా.. ఆయనను ఏనుగు వెంబడించి చంపేసింది. స్థానిక అటవీ శాఖ, పోలీసు అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గోదావరి దాటుతూ ముగ్గురు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం(అంబేద్కర్ కోనసీమ)

గౌతమి గోదావరి నది దాటుతుండగా ప్రమాదవశాత్తూ ఇద్దరు మహిళలు, ఒక బాలిక మృతి చెందారు. ఈ ఘటన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆలమూరు మండలం బడుగువాని లంకకు చెందిన కర్రి సునీత (16) ఇటీవల పదో తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలో ఆమె అదే ప్రాంతానికి చెందిన పల్లూరి సత్య అనంతలక్ష్మి (40), కప్పిరెడ్డి ఏసమ్మ (60)లతో కలిసి శనివారం వాడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరింది. వారు ముగ్గురు మడికి వద్ద గౌతమి గోదావరిని దాటుతుండగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గల్లంతయ్యారు. రాత్రయినా వారి సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గల్లంతైన సమీపంలోనే మూడు మృతదేహాలను స్థానికులు గుర్తించారు. మృతులు అనంతలక్ష్మి, ఏసమ్మ, సునీతగా గుర్తించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎస్ శ్రీనివాసు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



ఏసమ్మ



సత్యఅనంతలక్ష్మి



సునీత

దేవుడిపై ప్రమాణం.. ఆపై తాయిలాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

డబ్బులిచ్చినా ఓటర్లు ఓటు వేస్తారో లేదోననే అపనమ్మకంతో తిరుపతి వైసిపి అభ్యర్థి అనుచరులు, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవుడిపై ప్రమాణం చేయిస్తున్నారు. 'ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం.. మా కుటుంబ సభ్యులతోనూ వేయిస్తాం' అని గంగమ్మ గుడి దగ్గర కర్పూరం వెలిగించి ఓటర్లతో బలవంతంగా ప్రమాణం చేయిస్తున్నారు. ఓటర్లకు బలవంతంగా మందు, డబ్బులు పంచడమే గాకుండా, ఓటు వేయాలని ప్రమాణం చేయించడాన్ని తప్పుబడుతూ తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్‌కు జనసేన, టిడిపి అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు కేతం జయచంద్రారెడ్డిపై కేసు నమోదు చేశారు. పద్మావతిపురం, పద్మావతి యూనివర్సిటీలోని మరో బూత్ వద్ద ఓటర్ల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బెలూన్లు, చలువ పందిళ్లు వైసిపి రంగుల్లో ఉన్నాయని, వెంటనే తొలగించాలని తిరుపతి టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్ ఫిర్యాదు చేశారు.



గంగమ్మ గుడి వద్ద కర్పూరం వెలిగించి ఓటరుతో ప్రమాణం చేయిస్తున్న వైసిపి నాయకులు

సొంతూళ్లకు జనం..

- విజయవాడలో సర్వీసులు లేక ప్రయాణికుల పాట్లు
- రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు : ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజానీకం పోటెత్తుతున్నారు. వివిధ ఉద్యోగ, వ్యాపార, వృత్తి రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలివెళ్లిన ప్రజలు, యువత ఓట్లు వేసేందుకు సొంతూళ్లకు క్యూ కడుతున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి పెద్ద సంఖ్యలో జనాలు తరలొస్తుండటంతో బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, ఇతర రవాణా సర్వీసులు కిక్కిరిశాయి. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, ఇంకొందరు సొంత వాహనాల్లోనే ఇళ్లకు పయనమయ్యారు. దీంతో జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులన్నీ వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఐటి, ఇతర ఉద్యోగాలకు శనివారం, ఆదివారం సెలవులు కావటం, పోలింగు సందర్భంగా సోమవారం కూడా సెలవురోజు అవటం.. ఈసారి ఇళ్లకు పయనమయ్యే వారి సంఖ్య బాగా పెరిగింది. మరోవైపు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి (సొంతూరు) వెళ్లేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో బస్టాండ్లు రద్దీగా మారాయి. దీంతో సొంత గమ్యానికి చేరాలంటే ఒక్కొక్కరు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

యువత ఉత్సాహం

గడిచిన పదేళ్లలో లక్షలాది మంది యువత రాష్ట్రం నుంచి ఉపాధి, ఉద్యోగాల కోసం తెలంగాణలోని హైదరాబాద్, కర్ణాటకలోని బెంగళూరుకు తరలివెళ్లారు. రాష్ట్రంలో ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేకపోవటంతో ప్రతి సంవత్సరం లక్షలాది మంది పట్టభద్రులు, ఇంజినీరింగు అభ్యర్థులు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావటంతో వారంతా కసిగా ఈ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకుని, భవిష్యత్‌కు బాటలు వేసే పార్టీని గెలిపించుకునేందుకు సిద్ధమయ్యారు. అలాగే తొలిసారి ఓటు హక్కు సాధించిన ఎక్కువ మంది యువత కూడా తమ హక్కును వినియోగించుకునేందుకు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా ఊళ్లన్నీ ప్రజలతో సందడిగా మారాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు హైదరాబాద్ లేదా బెంగళూరు నుంచి ఎక్కువ మంది రాష్ట్రానికి వస్తుంటారు. అయితే ఇప్పుడు అంతకంటే ఎక్కువ మంది ఓటు వేసేందుకు తరలొస్తుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇలా లక్షలాదిగా తరలొస్తున్న యువత ఎవరికి ఓటు వేస్తారు? వారు ఎటువైపు మొగ్గు చూపుతారు? వారి ప్రభావం ఎంత? అనే అంశంపైనా రాజకీయ పక్షాల్లో విపరీతమైన చర్చ నడుస్తోంది.



ప్రయాణికులతో కిక్కిరిసిన విజయవాడ బస్టాండ్

కిక్కిరిసిన విజయవాడ బస్‌స్టేషన్

విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకునేందుకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర సుదూర ప్రాంతాల నుంచి రైళ్లలో వచ్చిన వారు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు బస్సు సర్వీసులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు వెళ్లేందుకు వేలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఈ నెల 12న (ఆదివారం) హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులను తరలించడానికి 121 స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు వెల్లడించారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి ఇవి ఏమాత్రమూ చాలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు వెచ్చించి, కూర్చొనేందుకు సీటు లేక నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోయారు.

ప్రత్యేక బస్సుల కోసం 9959111281 సంప్రదించండి: ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సామగ్రిని గ్రామాలకు తరలించేందుకు 5,458 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఓటర్లకు అవసరమైతే రద్దీని బట్టి 40 మంది వున్నామని కోరితే ఆ ప్రాంతానికి నేరుగా ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం ద్వారకా తిరుమలరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే హైదరాబాద్‌కు 1,066, బెంగళూరుకు 284 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని తెలిపారు. విజయవాడ నుండి విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు ఎక్కువగా నడుపుతున్నామన్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసిందని, ప్రత్యేక బస్ సర్వీసుల కోసం 9959111281 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వైసిపిది తప్పుడు ప్రచారం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తప్పుడు వీడియోలు, ఆడియోలు, పోస్టులతో వైసిపి ప్రచారం చేస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి అంచుల్లో ఉన్నా వైసిపికి బుద్ధి రాలేదని ఆదివారం ఎక్స్ (ట్విట్టర్)లో విమర్శించారు. కొన్ని గంటల్లో పోలింగు మొదలవబోతుందని, ఇప్పుడైనా నిజాయతీగా ఉండాలనే జ్ఞానం జగన్‌కు లేదని విమర్శించారు. కుల, మతాలను రెచ్చగొట్టే వీడియోలను చేయించారని ఆరోపించారు. తాను మాట్లాడినట్లు ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇలాంటి ఫేక్ వీడియోలు కుప్పలు తెప్పలుగా జగన్ చేయిస్తారని, వీటిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కుట్రలతో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై పోలీసులు, ఎన్నికల అధికారులు తక్షణం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల నేతలతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. పూర్తిస్థాయి అప్రమత్తతతో చివరి ఓటు పోల్ అయ్యేవరకు పనిచేయాలని చెప్పారు. పోలింగ్ శాతం పెరిగేలా పార్టీ తరపున ప్రయత్నం చేయాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా సౌకర్యవంతంగా ఓటు వేసే పరిస్థితిని కల్పించాలన్నారు. బిడ్డల భవిష్యత్తు కోసం నిత్యం శ్రమించే అమ్మలకు పాదాభివందనం అంటూ చంద్రబాబు ట్విట్టర్‌లో మాతృ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

సజ్జల భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలి : దేవినేని

తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసిపి నేత సజ్జల భార్గవ్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఓడిపోతున్నామనే భయంతో జగన్, అతని గ్యాంగ్ మొత్తం దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పినట్లు భార్గవ్ రెడ్డి మార్ఫింగ్ వీడియోలు చేశారని, అచ్చెన్నాయుడు పేరుతో తప్పుడు లేఖలు సృష్టించారని విమర్శించారు. ఈ దుష్ప్రచారాలను ఆపేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కోరామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కోరారు. తిరుపతిలో ఓటర్లతో ప్రమాణం చేయించిన వైసిపి నేత కేతన రామారావుపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లకు వర్ల రామయ్య లేఖలు రాశారు.

విధుల్లోకి 'ఎయిరిండియా' సిబ్బంది

ముంబయి : ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తమ విమాన సేవలను క్రమంగా పునరుద్ధరిస్తోంది. రద్దయిన విమానాల సంఖ్య ఆదివారం నాటికి 20కి తగ్గింది. అనారోగ్య సెలవులపై వెళ్లి.. తమ నిరసన వ్యక్తం చేసిన క్యాబిన్ సిబ్బంది మొత్తం విధుల్లో చేరినట్లు కంపెనీ అధికారి ఒకరు వెల్లడించారు. మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో విమానాలు నడుస్తాయని తెలిపారు. కంపెనీలో నిర్వహణ లోపాలు, కొంతమంది సిబ్బందిపై వివక్షను నిరసిస్తూ క్యాబిన్ సిబ్బందిలో దాదాపు 300 మంది సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో గతవారంలో చాలా విమాన సర్వీసులు రద్దయ్యాయి. అప్రమత్తమైన సంస్థ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. వారితో సంప్రదింపులు జరపడంతోపాటు విధుల్లో చేరకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. సెలవుపై వెళ్లిన సిబ్బంది ఈ నెల 11 నాటికి పూర్తిగా విధుల్లో చేరారని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ వెల్లడించింది. కంపెనీ షెడ్యూలింగ్ సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా ఇంకా కొంత మంది సెలవుపై ఉన్నట్లు చూపిస్తోందని తెలిపింది.

ఎన్నికల ముంగిట హర్యానా సంక్షోభం

● పది స్థానాలున్న రాష్ట్రంలో మే 25న పోలింగ్
● ప్రభావం పడుతుందని బిజెపి బెంబేలు

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

హర్యానాలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల సమయాన బిజెపికి తలనొప్పిగా తయారైంది. పది లోక్‌సభ స్థానాలున్న హర్యానాలో ఈనెల 25న ఆరో దశలో ఎన్నికలు జరగనున్నాయి. హర్యానాలో ఇటీవల ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకోవడంతో కాగా, బిజెపి బలం 39. ముగ్గురు ఇండిపెండెంట్ల మద్దతు ఉప సంహరణతో బలం 36కి తగ్గింది. బిజెపి తన బల నిరూపణకు 45 మంది ఎంఎల్‌ఎలు అవసరం. కాగా, ఇప్పటి వరకూ బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన మాజీ ఉప ప్రధాని దేవీలాల్ మనవడు, జెజెపి అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా పార్టీకి 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదలిస్తే ఆ పార్టీకి తమ పార్టీ



నాయబ్‌సింగ్ సైనీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మైనారిటీలో పడింది. ప్రభుత్వానికి బలం లేదనీ, రాష్ట్రపతి పాలన విధించాలని కాంగ్రెస్, బిజెపి మాజీ భాగస్వామి జెజెపి డిమాండ్ చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తరుణంలో ఈ పరిణామం బిజెపిని కలవర పరుస్తోంది. హర్యానా ముఖ్యమంత్రి పదవికి మనోహర్‌లాల్ కట్టర్‌తో రాజీనామా చేయించి ఆయన స్థానే సైనీని ఇటీవల బిజెపి అధిష్టానం ప్రతిష్టించింది.

వేడెక్కిస్తున్న పరిణామాలు

హర్యానాలో ఏడుగురు ఇండిపెండెంట్లు ఉన్నారు. మద్దతు ఉపసంహరించుకున్న ముగ్గురు ఇండిపెండెంట్లు మంత్రి పదవులను ఆశించారు. ఇందుకు బిజెపి అధిష్టానం నుంచి అనుమతి లభించలేదు. దాంతో వారు సైనీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. హర్యానా అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 90 మద్దతు ఇస్తుందని దుష్యంత్ చౌతాలా ఇప్పటికే ప్రకటించారు.

సర్వశక్తులూ ఒడ్డుతున్న కమలం

బిజెపి తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి సర్వశక్తులను ఒడ్డుతోంది. గవర్నర్‌పై కేంద్రం నుంచి ఒత్తిడి ఉందని కాంగ్రెస్ పేర్కొనగా, అదేమీ లేదని బిజెపి ఖండిస్తోంది. మొత్తం మీద హర్యానాలో రాజకీయ అస్థిరత నెలకొంది. హర్యానా ఆది నుంచి రాజకీయ అస్థిరతకు పేరొందింది. రావు బీరేందర్ సింగ్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు పార్టీలను అతి సునాయాసంగా మారేవారు. పొద్దున ఒక పార్టీలో, రాత్రి మరో పార్టీలో ఉండేవారు. ప్రభుత్వాన్ని కాపాడు కోవడానికి ఫిరాయింపులను ప్రోత్సహించడంలో బిజెపి కాంగ్రెస్‌ని మించి పోయింది. దేవీలాల్, బన్సీలాల్, భజన్‌లాల్ వంటి హేమాహేమీల హయాంలోనూ ఎమ్మెల్యేలు పార్టీలను ఫిరాయించడం హర్యానాలో రికార్డు సృష్టించింది.



నాలుగోదశ ఎన్నికలకు జార్ఖండ్ రాష్ట్రం సింగ్‌భూమ్ లోక్‌సభ నియోజకవర్గంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు పోలింగ్ అధికారులను రైలులో పంపుతున్న దృశ్యం

హస్తం, కమలం 'మధ్య' పోరు

● నేడు 8 స్థానాల్లో రాష్ట్రంలో తుది దశ పోలింగ్
● గిరిజన ఓటు బ్యాంకుతో కాంగ్రెస్
● హిందుత్వ రాజకీయాలతో కాషాయ పార్టీ
● సిట్టింగ్‌లను మార్చిన బిజెపి
● రాహుల్ జోడో యాత్ర ప్రభావం



మధ్యప్రదేశ్‌లోని 29 లోక్‌సభ స్థానాలకుగాను 21 స్థానాలకు ఒకటి, రెండు, మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. మిగిలిన ఎనిమిది నియోజకవర్గాలు.. దేవాస్, ఉజ్జయిని, మందసోర్, రత్లామ్, ధార్, ఇండోర్, ఖర్గన్, ఖాండ్వా నియోజకవర్గాల్లో నాలుగో విడత మే13న ఎన్నికలు జరగనున్నాయి. హిందుత్వ రాజకీయాలతో బిజెపి, గిరిజన, ముస్లిం ఓటు బ్యాంకుపై ఆశతో కాంగ్రెస్ తలపడుతున్నాయి. గిరిజన ప్రాంతాల గుండా సాగిన రాహుల్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ధార్, ఖర్గావ్‌లలో ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం చేశారు.

ధార్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి రాధేశ్యామ్ మువెల్ పోటీ చేస్తుండగా, సిట్టింగ్ ఎంపి ఛత్‌సింగ్ ధర్బార్‌ను తప్పించి సావిత్రి ఠాకూర్‌ను బిజెపి బరిలోకి దింపింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపి గజేంద్ర సింగ్ బిజెపిలో చేరారు. బిజెపి మత రాజకీయాలకు తెరతీసింది. భోజ్‌షాలా ఆలయం, మసీదు ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్టించాలని హైకోర్టులో వేసిన పిల్‌తో మళ్లీ హిందు, ముస్లింల మధ్య గొడవ రగులుకుంది. ఈ ప్రభావం ఎన్నికల మీద పడుతుందంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ గిరిజన, ముస్లిం ఓటు బ్యాంకు కలిగి ఉంది. ధార్ పరిధిలోగల అసెంబ్లీ స్థానాల్లో హస్తం గెలుపొందింది.

దేవాస్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి రాజేంద్ర మాలవియా, బిజెపి నుంచి సిట్టింగ్ ఎంపి మహేంద్రసింగ్ సోలంకి పోటీ పడుతున్నారు. బలాయ్, కుల ప్రాతిపదికన కేటాయింపు జరిగింది. మాలవీయ, సోలంకి ఇద్దరూ ఒకే సామాజిక తరగతికి చెందినవారే. సోలంకికి ఆర్‌ఎస్‌ఎస్ బలం లభించగా గత ఎన్నికల్లో గెలిచినా ఈసారి అధికార వ్యతిరేకత, గ్రామాల్లో ఉపాధి లేమి వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఖర్గోన్: ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోర్లాల్ ఖర్తే, బిజెపి నుంచి సిట్టింగ్ ఎంపి గజేంద్ర పటేల్ పోటీ చేస్తున్నారు. ఎస్టీ రిజర్వుడ్ సీటు కావడంతో గిరిజనుల ప్రాబల్యమెక్కువ.. ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ భావజాలాన్ని నూరిపోస్తోంది. హిందు, ముస్లింల మధ్య ఘర్షణలు చర్చనీయాంశమవుతున్నాయి. 2022లో రామనవమి తర్వాత జరిగిన అల్లర్లలో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం బుల్డోజర్లతో ముస్లిం నివాసాలను, షాపులను కూల్చివేసింది. దాంతో ముస్లింలు బిజెపిని వ్యతిరేకిస్తున్నారు. తాజాగా ధార్, ఖర్గోన్ జిల్లాల్లో మోడీ పర్యటించారు.

ఉజ్జయిని: ఎస్సీ రిజర్వుడ్ సీటు ఉజ్జయినిలో కాంగ్రెస్ నుంచి మహేశ్ పర్మార్‌కు పోటీగా బిజెపి నుంచి సిట్టింగ్ ఎంపి ఫిరోజియా తలపడుతున్నారు. ఈ నియోజకవర్గంలో 63 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ క్షిప్రా నది అభివృద్ధి మరిచిందని, ఆ నదిని శుద్ధిచేసేంత వరకు పోరాడతానని కంకణం కట్టుకున్న మహేశ్‌కు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది.

మందసార్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి దిలీప్ సింగ్ గుప్తా, బిజెపి నుంచి సుధీర్ గుప్తా పోటీపడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి గెలిచింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డీలా పడింది. ఇవిఎంల పనితీరుపై అనుమానం వ్యక్తం చేసింది. అయితే ఈసారి ఎన్నికల్లో రాహుల్ గాంధీ చేసిన పాదయాత్రకు విశేష స్పందన కనిపించడంతో హస్తం శ్రేణులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మోడీ ప్రభుత్వం తెచ్చిన అగ్నిపథ్ పథకంపై యువత వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వైపు యువత ఆశక్తి చూపుతున్నారు.

రత్లామ్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి కంతిలాల్ భురియా, సిట్టింగ్ ఎంపి గుమన్ సింగ్‌ను మార్చి అనిత నగర్ సింగ్ చౌహాన్‌కు బిజెపి టికెట్ ఇచ్చింది. రత్లామ్ కాంగ్రెస్ కంచుకోట. ఆ పార్టీకి చెందిన దిలీప్ సింగ్ భురియా, కాంతిలాల్ భురియాలే ఈ స్థానంలో గెలుస్తూ వచ్చారు. కానీ 2014లో దిలీప్ సింగ్ భురియా బిజెపిలో చేరి పోటీ చేసి గెలిచారు. అందుకే అక్కడ బిజెపి గెలిచింది.



మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్



భారత్ జోడో యాత్రలో మధ్యప్రదేశ్ మాజీ సిఎం కమల్‌నాథ్‌తో రాహుల్‌గాంధీ

ఖాండ్వాలో కాంగ్రెస్‌కు పట్టు ఉండేది. హస్తం రెబల్స్ బిజెపికి తావిచ్చారు. ఎమర్జెన్సీ తర్వాత జనసంఘ్, కాంగ్రెస్‌లో చీలికలు తెచ్చింది. రామజన్మభూమి వ్యవహారం బిజెపిని బలపరిచింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి నరేంద్ర పటేల్, బిజెపి నుంచి జ్ఞానేశ్వర్ పాటిల్ పోటీ చేస్తున్నారు.

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గం ఇండోర్‌లో చివరి క్షణంలో కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్ ఉపసంహరించుకుని బీజెపిలో చేరారు. దీంతో బిజెపి సిట్టింగ్ ఎంపి శంకర్ లల్వానీకీ గెలుపు ఖాయమైపోయినట్లే. కానీ బరిలో మరో 14 మంది అభ్యర్థులు ఉండటంతో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో నోటాకు ప్రజలు ఓటేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చింది.

ఎలక్షన్ డెస్క్

చండీగఢ్‌లో ద్విముఖ పోటీ


● మేయర్ ఎన్నికల్లో బిజెపి అక్రమాలను అడ్డుకున్న సుప్రీం కోర్టు
● ఆ ప్రభావం ఎంపి ఎన్నికలపైన ● కేజ్రీవాల్ అరెస్ట్ కూడా.. ● ఈసారి ఆప్ మద్దతుతో కాంగ్రెస్ పోటీ

ఎలక్షన్ డెస్క్

పంజాబ్, హర్యానాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో కాంగ్రెస్, బిజెపిల మధ్య పోటీ నెలకొంది. ఈ కేంద్రపాలిత ప్రాంత నియోజకవర్గానికి ఏడవ దశలో జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ బలం పుంజుకుంది. గత ఏడాది జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ ఫుల్ మెజారిటీ సాధించి బిజెపికి షాక్ ఇచ్చింది. అయితే లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టు ఉండటంతో ఇండియా బ్లాక్‌లో సీట్ల సర్దుబాటులో భాగంగా మనీష్ తివారీని కాంగ్రెస్ బరిలోకి దించింది. చండీగఢ్‌లో ఆప్,కాంగ్రెస్ కూటమిగా పంజాబ్‌లో విడిగా పోటీ పడుతున్నాయి. చండీగఢ్‌లో ఇప్పటి వరకు కాంగ్రెస్ ఏడుసార్లు, బిజెపి నాలుగు సార్లు, భారతీయ జన సంఘ్, జనతా దళ్, జనతా పార్టీ ఒక్కోసారి గెలుపొందాయి.



మనీష్ తివారీ



సంజయ్ తండన్

ఎక్కువసార్లు కాంగ్రెసే

బిజెపి తొలుత సిట్టింగ్ ఎంపి కిర్రాణ్‌కేర్‌కే సీటు కేటాయించినా తదుపరి హిమాచల్‌ప్రదేశ్ బిజెపి కో-ఇన్‌ఛార్జ్ సంజయ్ తండన్‌ను నియమించింది. శిరోమణి అకాలీ దళ్ అభ్యర్థి హర్దీప్ సింగ్ సైనీ పోటీ చేస్తారనుకోగా, నామినేషన్ల ముందురోజు పార్టీకి రాజీనామా చేసి తప్పుకున్నారు. ఆయన బిజెపిలో చేరనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ విడిగా పోటీ చేశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కిర్రాణ్ కేర్ గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి పవన్ బెన్సాల్ చండీగఢ్‌లో ఎక్కువ కాలం ఎంపిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో మనీష్ తివారీ తరుపున, పవన్ బెన్సాల్ సతీమణి, కూతురు ప్రచారంలో పాల్గొంటున్నారు. నిరుద్యోగం, మహిళల సమస్యలు, పంజాబ్ యునివర్శిటీ విద్యార్థుల సమస్యలు వంటి వాటిని ఎజెండాగా చేసుకొని ప్రచారం చేస్తున్నారు. మెజార్టీ అర్బన్ ఓటర్లు మెజారిటీ అర్బన్ ఓటర్లదే పైచేయి. 2.8 శాతం రూరల్ ఓటర్లు, 18.9 శాతం షెడ్యూల్ కులాల ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 80 శాతం హిందూ ఓటర్లు, 15 శాతం సిక్కు ఓటర్లు ఉన్నారు. రైతుల ఆందోళన ఉద్యమం ప్రభావం పడనుంది.

బిజెపి అక్రమాలు

2023 ఫిబ్రవరిలో జరిగిన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో చట్టాలకు పాతరేసిన బిజెపి తీవ్ర అక్రమాలకు పాల్పడింది. ఈ స్థానంలో ఇండియా బ్లాక్‌లో భాగంగా కాంగ్రెస్, ఆప్‌లు తమ సంయుక్త అభ్యర్థి కుల్దీప్ కుమార్‌ను నిలబెట్టాయి. దీంతో కాంగ్రెస్-ఆప్ గెలిస్తే దాని ప్రభావం లోక్‌సభ ఎన్నికపై పడుతుందేమోనని బిజెపి అక్రమాలకు ఒడిగట్టింది. ఏకంగా బ్యాలెట్ పత్రాలనే ట్యాంపరింగ్ చేసి దొడ్డిదారిన బిజెపి అభ్యర్థిని ఎన్నుకుంది. ఈ చర్యపై సుప్రీంకోర్టు స్పందించి మేయర్ మనోజ్ సోంకార్ ఎన్నిక సరైంది కాదని తీర్పు చెప్పింది. కాంగ్రెస్, ఆప్ కూటమి అభ్యర్థి కుల్దీప్ కుమార్ ఎన్నికయ్యారు. సుప్రీంకోర్టు తీర్పుపై ప్రధాని మోడీ నోరుమెదపలేదు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఆప్ 135 సీట్ల భారీ మెజారిటీ సాధించింది. అక్రమ కేసులను పెట్టి ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది.ఆ ప్రభావం చండీగఢ్ లోక్‌సభ ఎన్నికలపై పడనుందని విశ్లేషకులు అంటున్నారు.



కుల్దీప్ కుమార్

యుపిలో 'ఇండియా'దే మెజార్టీ : అఖిలేష్ యాదవ్



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఈ ఎన్నికల్లో 'ఇండియా' ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధినేత అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బారాబంకిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బారాబంకి ఎస్‌పికి కంచుకోట వంటిది. ఈ ఎన్నికల్లో యుపిలో దళితులు, మైనార్టీలు, ఓబిసీలు ఎన్డీయేను ఓడించబోతున్నారు. ఆయా తరగతులను బిజెపి మోసగించింది. బిజెపి ప్రభుత్వ హయాంలో వారికి దక్కాల్సిన హక్కులు, గౌరవం దక్కలేదు. అణగారిన వర్గాలు కాషాయ పార్టీకి తగిన బుద్ధి చెప్పబోతున్నాయి. బిజెపి తాను తీసుకున్న గోతిలో తానే పడింది. ఈ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ యుపిలోని 80 స్థానాల్లో 79 గెలుచుకోనుంది. ఎన్నికల ఫలితాల అనంతరం తమ ఎంపీలు ప్రధానమంత్రి ఎవరనే దానిపై నిర్ణయం తీసుకుంటారు' అని అన్నారు.

కలం బాణాలు

నేడు పోలింగ్




ఈరోజున ఆంధ్రావని
కీలకమౌ ఓటు
ప్రలోభాల తోసిపుచ్చి
ప్రజాశక్తి చాటు

కులం ధనం భయంలేక
చూపాలండీ విజ్ఞత
చారిత్రక తీర్పు తోనె
రాష్ట్రం దేశం భవిత

శిల్పా రవిచంద్రను గెలిపించండి : అల్లు అర్జున్

ఆఖరి క్లైమాక్సులో
అల్లు అర్జునాస్త్రం
మెగా పాలిటిక్స్ లోన
నయా పుష్పశాస్త్రం

కమ్యూనిస్టు తాతగారి
బహుముద్దుల మనవడా
అటు మామ ఇటు దోస్తుల
రాజకీయ మెరుగడా?



ఇంత పెద్ద ఎన్నికలను
సవ్యంగా నిర్వహణం
నమ్మి అప్పగించిన
బాధ్యత కద రాజ్యాంగం

మోడీజీనే మోస్తూ
ఏకపక్ష వ్యవహారం
తలవంపులు తెచ్చేలా
సిఇసి నిర్వాకం

- తె.ర

మోడీ సహా బిజెపి నేతలపై చర్యలేవి? : ఇసికి ప్రముఖుల లేఖ



విజయవాడ సెంట్రల్‌లో రసవత్తర పోరు

- వైసిపి అభ్యర్థి నియోజకవర్గానికి కొత్త
- టిడిపి అభ్యర్థిపై అనేక ఆరోపణలు
- ఇండియా వేదిక అభ్యర్థికి సానుకూల అంశాలు

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న తాజా ఎన్నికలు రసవత్తరంగా మారాయి. పోలింగ్‌కు ఇక కొద్ది గంటలే మిగిలి ఉంది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి అభ్యర్థుల విజయావకాశాల కోసం ఆయా పార్టీల తరపున పెద్దఎత్తున ఓటర్లకు తాయిలాలు పంచే కార్యక్రమం శనివారం సాయంత్రం నుండి ఆదివారం అర్ధరాత్రి వరకూ యథేచ్ఛగా సాగింది. అదే సమయంలో ఇండియా బ్లాక్ తరపున పోటీచేస్తున్న సిపిఎం అభ్యర్థి ప్రజల్లో ఉండి పోలింగ్ శాతం పెరిగేలా ఇండియా బ్లాక్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వైసిపి తరుపున పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాస్, బిజెపి, జనసేన మద్దతుతో టిడిపి అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీల కలయిక అయిన ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ప్రధాన పోటీలో ఉన్నారు.

నియోజకవర్గంలో రెండు లక్షల 70 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధిక మంది మహిళా ఓటర్లే. సిట్టింగ్ వైసిపి ఎంఎల్ఎగా ఉన్న మల్లాది విష్ణు గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుపై కవలం 25 ఓట్ల మెజార్టీతో గెలవడంతో ఈసారి గెలుపు కష్టమని భావించి.. విష్ణుకు టికెట్ ఇవ్వడానికి ఆ పార్టీ అధిష్టానం నిరాకరించింది. పశ్చిమలోనూ వెల్లంపల్లి పరిస్థితి కూడా అలాగే ఉండడంతో ఆయనను సెంట్రల్‌కు బదిలీ చేసింది. అయితే వెల్లంపల్లి రాకను స్థానిక నేతలు ప్రధానంగా మల్లాది విష్ణు అనుచరులు తొలినాళ్లలో బహిరంగంగానే వ్యతిరేకించారు. ఆయనకు మద్దతిచ్చేది లేదని నేతలు బహిరంగంగానే పత్రికలకెక్కారు. మరికొందరైతే ...'మా కేం చేస్తారో' చెప్పాలని వెల్లంపల్లి కార్యాలయంలోనే బేరసారాలకు దిగారు. ఇప్పటికీ ఆ అసమ్మతి కొంతమేర అయినా కొనసాగుతున్నదనే చెప్పాలి. వెల్లంపల్లిపై గత ఐదేళ్లలో అనేక ఆరోపణలు వచ్చాయి. పశ్చిమలో అభివృద్ధి పనులు ఏమీ చేపట్టలేదని తీవ్ర విమర్శలున్నాయి. అక్కడ పనికి రాని వ్యక్తి సెంట్రల్‌లో ఎలా పనికొస్తారని ఇక్కడికి ఎలా మార్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లను, వారి ద్వారా ఓటర్లను ప్రలోభపరచారని ఇప్పటికే పత్రికల్లో ఫొటోలు సహా వార్తలొచ్చాయి. వెలంపల్లి గెలిస్తే తన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందనే ఆందోళన మల్లాది విష్ణులో ఉందనే ప్రచారం సాగుతోంది. ఇప్పటి వరకు వారిద్దరూ కలిసి ప్రచారం చేసింది కూడా తక్కువే. వెల్లంపల్లి...తనను గెలిపిస్తే చేయబోయే పనుల గురించి ప్రజలకు ఏవిధమైన హామీ ఇవ్వలేకపోతున్నారు.




మరోవైపు బొండా ఉమా దుందుడుకుగా ఉంటారనే పేరుంది. రవాణా శాఖాధికారులు సహా పోలీస్, ఇతర శాఖల అధికారులపైకి దూసుకుపోవడం, భూముల కబ్జా, తనయుల దౌర్జన్యం వంటి అంశాలు ఆయనకు ప్రతికూలంగా ఉన్నాయి. బొండాకూ అసమ్మతి బెడద వెన్నాడుతూనే ఉంది. మాజీ కార్పొరేటర్లు గండూరి మహేష్, మాజీ కార్పొరేటర్ భర్త కోసూరు సుబ్రహ్మణ్యం (మణి), మరికొందరు ఎన్నికలకు కొద్దిరోజుల ముందే సిఎం సమక్షంలో వైసిపిలో చేరారు. అంతేగాక బిజెపితో జతకట్టడంతో ముస్లిం మైనారిటీలు, దళితుల ఓట్లు ఏ మేరకు టిడిపికి పడతాయనే సందేహం ఆ పార్టీని గందరగోళంలో పడేస్తోంది. ఇటీవల సిఎంపై జరిగిన రాయి దాడి ఘటన కూడా ఆయనకు తీవ్ర తలనొప్పిగా తయారైంది.

సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావుకు నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. అటు వైసిపి, ఇటు టిడిపి అభ్యర్థుల నిర్వాకాలను ఆయన వివిధ రూపాల్లో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా, స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సెంట్రల్ నియోజకవర్గంతోపాటు నగర వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను బాబూరావు గుర్తు చేశారు. . ఆయనకు మద్దతుగా కాంగ్రెస్, సిపిఐ, ఆమ్‌ఆద్మీతో పాటు రాజ్యాంగ పరిరక్షణా కమిటీ నాయకులు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విజయవాడ మాజీ మేయర్ మల్లికాబేగం, ప్రముఖ ఇంజినీర్, మాజీ ఎంపి కెఎల్‌రావు కుమారుడు కె శ్రీనివాస్, మాజీ ఐఎఎస్‌లు, పౌర సంఘాల నేతలు కూడా ప్రచారం చేశారు.

పులివెందులలో జగన్, ఉండవల్లిలో చంద్రబాబు

- ఓటు హక్కు వినియోగించుకోనున్న నేతలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి, టిడిపి, జనసేన అధినేతలు నేడు వారి, వారి ప్రాంతాల్లో సోమవారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తను పోటీ చేస్తున్న పులివెందుల నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం సాయంత్రమే తాడేపల్లి నుంచి పులివెందులకు జగన్ చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మంగళగిరి నియోజకవర్గంలోని ఉండవల్లిలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పులివెందుల నియోజకవర్గం ఇడుపులపాయలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళగిరిలోని లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో ఓటు వేయనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విజయవాడలోని గవర్నరుపేటలో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

అందరి దృష్టి మంగళగిరిపైనే

- నారా లోకేష్ భవిష్యత్తును తేల్చనున్న ఫలితాలు
- పట్టు నిలుపుకునేందుకు వైసిపి యత్నం
- ప్రధాన అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావితం చేయనున్న సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో అందరి దృష్టి రాజధాని ప్రాంతం మంగళగిరిపైనే కేంద్రీకృతమైంది. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ టిడిపి, వైసిపి మధ్య ఉన్నా ఇండియా వేదిక తరపున సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్నా శివశంకరరావు ప్రధాన పార్టీల విజయావకాశాలను ప్రభావితం చేసేలా ప్రచారంలో దూసుకుపోయారు. టిడిపి నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోటీ చేస్తుండగా, వైసిపి నుంచి మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు లావణ్య పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయిన నారా లోకేష్ ఈసారి ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు. 2014, 2019లో రెండు సార్లు వైసిపి అభ్యర్థిగా ఆళ్ల రామకృష్ణారెడ్డి గెలుపొందారు.

40 ఏళ్లుగా టిడిపికి ఎదురుదెబ్బ

లావణ్య తల్లి కాండ్రు కమల 2009లో మంగళగిరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. లావణ్య మామ మురుగుడు హనుమంతరావు 1999, 2004లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2006లో ఆయన మంత్రిగా పనిచేశారు. 1985 తరువాత ఈ నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే లేకపోవడం కూడా ఆ పార్టీకి గత 40 ఏళ్లుగా ఎదురుదెబ్బ అని చెప్పొచ్చు.

కమ్యూనిస్టులకు పట్టున్న ప్రాంతం

కమ్యూనిస్టులకు బాగా పట్టున్న నియోజకవర్గాల్లో మంగళగిరి ఒకటి. టిడిపి పొత్తుతో 1995లో సిపిఎం తరపున నిమ్మగడ్డ రామ్మోహనరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999, 2004, 2009, 2014లోనూ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు ఎవరితోనూ పొత్తు లేకుండానే పోటీ చేస్తూ ప్రధాన పార్టీల విజయావకాశాలను ప్రభావితం చేశారు. 2019లో జనసేన, బిఎస్‌పి పొత్తుతో సిపిఎం పోటీ చేసింది. ఈసారి ఇండియా వేదిక తరపున కాంగ్రెస్, సిపిఐ మద్దతుతో సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు పోటీ చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఆయనకు వివిధ తరగతుల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై స్పందిస్తూ.. పలు ఉద్యమాలు నిర్వహించిన శివశంకరరావుకు ప్రచారంలో అన్ని గ్రామాల నుంచి సానుకూలత వస్తోంది.

గెలుపు అవకాశాలు ఉన్నా గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించడం ద్వారా టిడిపి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో సిపిఎం కృషి చేసింది. వీరిలో 15 వేల మందికి పట్టాలను రెగ్యులరైజ్ చేశారు. ఇంకా 25 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది. గత పదేళ్లుగా ఈ అంశంపై వివిధ పోరాటాలు చేస్తున్నా వైసిపి, టిడిపి పట్టించుకోలేదు. అయితే ఈసారి నారా లోకేష్ మాత్రం తాను గెలిస్తే 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే గుంటూరు ఛానల్ తూటికాడ తొలగింపు సమస్యపై సిపిఎం పెద్దయెత్తున ఆందోళన చేసింది. పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ పనులు పూర్తిచేయడం ద్వారా 26 వేల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించే పనులు చేపట్టాలని సిపిఎం ఆందోళనలు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 20 శాతం పూర్తి కావాల్సి వుంది. వీటి పూర్తికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చిత్తశుద్ధితో కృషి చేయలేదన్న విమర్శలు ఉన్నాయి.



జొన్నా శివశంకరరావు



నారా లోకేష్



మురుగుడు లావణ్య

3 రాజధానుల ప్రతిపాదనపై వ్యతిరేకత

రాజధానిలో భాగమైన మంగళగిరి నియోజకవర్గంలో మూడు రాజధానుల ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో ఈ అంశం టిడిపికి కొంత సానుకూలత పెంచుతోంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా వైసిపి ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకంగా ఉన్నారని వీరు తమకు అనుకూలంగా ఓటు వేస్తారని టిడిపి అభ్యర్థి లోకేష్ విశ్వసిస్తున్నారు. అలాగే 2019లో ఓడిపోయిన తరువాత నియోజకవర్గ ప్రజలతో ఆయన మంచి సంబంధాలు కొనసాగించారు. వైసిపి అభ్యర్థి లావణ్య ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమాగా ఉన్నారు.

ఓటే కీలకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రచారం ముగిసింది. ఇక కీలక ఘట్టమైన పోలింగ్ నేడు జరగనుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఇప్పటి వరకూ బయట ఎన్ని తిప్పలు పడ్డా గెలుపోటములు నిర్ణయించేది ఓటింగే. ఓట్లంటే గతంలో బ్యాలెట్ పత్రాలపై తమకు నచ్చిన అభ్యర్థి ఎన్నికల చిహ్నంపై ముద్ర వేసేవారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన దరిమిలా, నిర్వహణా వ్యయాన్ని తగ్గించడానికి దాదాపు రెండు దశాబ్దాల కింద ఇవిఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) ప్రవేశపెట్టింది. దాంతో పోలింగ్, ఓట్ల లెక్కింపు గతం కంటే సులవయింది. ఇవిఎంలపై సందేహాలు రావడంతో ఓటరు ఎవరికి ఓటు వేశారో తెలుసుకోవడం కోసం వివిపిఎటి (ఓటరు వెరిఫైబల్ పేపర్ ఆడిట్ ట్రయల్)లను ఇవిఎంలకు అనుసంధానం చేసి ఉంచుతారు. ఈ రెండిటికీ కలిపి కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద ఉంటుంది. వివిప్యాట్, బ్యాలెట్ యూనిట్ ఓటింగు కంపార్టుమెంటులో ఉంచుతారు. ప్రతి బ్యాలెట్ యూనిట్లో 16 మంది పేర్లు మాత్రమే ఉంటాయి. అంతకుమించి ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉంటే అదనంగా మరో ఇవిఎం ఏర్పాటు చేస్తారు. ఒక కంట్రోల్ యూనిట్‌తో 384 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించవచ్చు. అంటే సుమారు 24 బ్యాలెట్ యూనిట్లు పెట్టవచ్చు. ప్రతి బ్యాలెట్ యూనిట్‌పై అంధులకోసం బ్రెయిలీ చిహ్నాలతో 1 నుండి 16 వరకు అంకెలు ముద్రించి ఉంటాయి.

వేసేది ఇలా..

పోలింగ్ బూత్‌కు వెళ్లాక మొదటి అధికారి ఓటరు కార్డు చెక్ చేస్తారు. దానితోపాటు ఐడి ప్రూఫ్ కూడా చూస్తారు. రెండో అధికారి వేలిపై ఇంకు ముద్ర వేస్తారు. అక్కడే రిజిస్టర్‌లో(17ఏ)లో ఓటరుతో సంతకం చేయించుకుని స్లిప్ ఇస్తారు. దాన్ని తీసుకుని మూడో అధికారి వద్దకు వెళితే స్లిప్ తీసుకుని వేలిపై ఇంకు ముద్ర చూసి పోలింగ్ కంపార్టుమెంటులోకి పంపిస్తారు. అక్కడ కంట్రోల్ యూనిట్ నుండి ఓటు వేసేందుకు అనుమతి ఇస్తారు. కంపార్టుమెంట్లో పెట్టిన ఇవిఎం మిషన్‌లో ఎడమచేతివైపు పార్టీలు వాటి గుర్తులు ఎదురుగా బ్లూ బటన్ ఉంటుంది. దాన్ని ప్రెస్‌చేయగానే రెడ్‌బల్బు వెలిగి బీప్ సౌండ్ వస్తుంది. వివిప్యాట్ మిషన్లో ఎవరికి ఓటు వేశారో ఆ గుర్తు ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. అనంతరం స్లిప్ సీల్డ్ డ్రాప్ బాక్సులో పడిపోతుంది. అయితే పోలింగ్‌కు మూడుగంటల ముందు పోటీలో ఉన్న అభ్యర్థులు ధృవీకరించిన ఏజెంట్ల సమక్షంలో ప్రతి ఇవిఎంలోనూ కనీసం 50 ఓట్లను ప్రయోగాత్మంగా పోల్ చేస్తారు. ఎటువంటి ఇబ్బందీ లేదనుకున్న తరువాత నిర్దిష్ట సమయానికి పోలింగ్ మొదలుపెడతారు. ప్రస్తుతం ఎంపి, ఎంఎల్ఎ రెండు ఎన్నికలూ ఒకేసారి జరుగుతున్నందున ఓటరు రెండు ఓట్లు వేయాలి. తొలుత ఎంపి ఓటు చేయడానికి మొదటి కంపార్టుమెంట్‌లోకి వెళ్లే ముందు తెలుపు స్లిప్, రెండవ కంపార్టుమెంట్‌లోకి వెళ్లే ముందు ఎంఎల్ఎ ఓటు కోసం గులాబి స్లిప్ ఇస్తారు.

కావాల్సిన గుర్తింపు కార్డులు

1. ఓటరు గుర్తింపుకార్డు 2. పాస్‌పోర్టు 3. డ్రైవింగ్ లైసెన్స్ 4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జారీ చేసిన సర్వీస్ కార్డులు 5. ఫోటోతో కూడిన బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్ 6. పాన్‌కార్డు 7. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు 8. ఉపాధి హామీ గుర్తింపు కార్డు 9.. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు 10. పెన్షన్ పుస్తకం 11. ప్రజాప్రతినిధులయితే వారి గుర్తింపుకార్డు, 12. అధార్‌కార్డు.. ఈ 12 కార్డుల్లో ఏదో ఒకటి చూపితే చాలు. అయితే ఓటరు ఫొటో దానిపై తప్పనిసరిగా ఉండాలి.



నాదెండ్లకు ఛాన్స్ దక్కేనా..?



నాదెండ్ల మనోహర్



అన్నాబత్తుని శివకుమార్



చావల గోపాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో ఈసారి వైసిపి, జనసేన అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది. వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోటీ చేస్తుండగా, ఎన్‌డిఎ కూటమి నుంచి జనసేన అభ్యర్థిగా మాజీ స్పీకరు నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తున్నారు. నామినేషన్ దాఖలులో దొర్లిన సాంకేతిక సమస్యలతో ఇక్కడ ఇండియా బ్లాక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో లేరు. కాంగ్రెస్ స్థానంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థి చావల గోపాల్‌కు ఇండియా బ్లాక్ మద్దతు ఇచ్చింది. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ప్రాతినిధ్యం వహించిన తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా ఆయన కుమారుడు మనోహర్ పోటీ చేస్తున్నారు. పొత్తులో జనసేనకు ఈ సీటు కేటాయించడంతో తొలుత టిడిపికి చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తరువాత క్రమంగా అసమ్మతి నేతలకు సీనియర్ నేతలు సర్దిచెప్పారు. ప్రస్తుతం టిడిపి, జనసేన, బిజెపి కలిసి పనిచేస్తున్నాయి. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కూడా ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కానీ బిజెపితో పొత్తు వల్ల ఈ నియోజకవర్గంలో జనసేనకు ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎక్కువ

2004, 2009లో కాంగ్రెస్ తరపున గెలుపొందిన నాదెండ్ల మనోహర్ తెనాలిలో జరిగిన అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. స్పీకరుగా ఉన్నప్పుడు దాదాపు రూ.1000 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు ఆయన చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి ఓడిపోయిన నాదెండ్ల మనోహర్ ఈసారి టిడిపి మద్దతుతో పోటీ చేయడం వల్ల తన గెలుపు ఖాయం అని భావిస్తున్నారు. అంతేగాక ప్రభుత్వ వ్యతిరేక ఓటు ప్రభావం కూడా ఎక్కువగా ఉండటం వల్ల తనకు సానుకూలత ఉన్నట్టు మనోహర్ చెబుతున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా 28,900 ఓట్లు సాధించగా, టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు 76,846 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ 17,649 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. టిడిపి, జనసేన ఓట్లతోపాటు ప్రభుత్వంపై వివిధ తరగతుల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తనకు అనుకూలంగా మారుతుందని మనోహర్ భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో వైసిపి, జనసేన అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా.. నేనా.. అన్నట్టు ఉంటుంది.

కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో పోటీ చేస్తున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థి చావల గోపాల్‌కు ప్రజల ఆదరణ లభిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపనున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నేడు సెలవు

సిపిఎం వినతిపై స్పందించిన ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికులకు సోమవారం క్లోజింగ్ హాలిడే (వేతనంతో కూడిన సెలవు)గా ప్రకటించాలని సిపిఎం వినతి మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించి చర్యలు తీసుకుంది. పోలింగ్ జరిగే రోజు వీరికి వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 16 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ కాంట్రాక్టు ఏజెన్సీల కింద పనిచేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం... రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారి హరీంద్రప్రసాద్‌ను సచివాలయంలో ఆదివారం సిఇఒను కలిసి వినతిపత్రం అందించారు. స్టీల్‌ప్లాంటులో 80 శాతం మంది కార్మికులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జనరల్ షిఫ్ట్‌లో పనిచేస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం 5:30 గంటల తర్వాత పోలింగ్‌లో పాల్గొనడం చాలా కష్టమని వివరించారు. దేశవ్యాప్తంగా ఆర్‌ఐఎన్‌ఎల్ విశాఖపట్నంతో సహా వివిధ బ్రాంచుల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు పోలింగ్ తేదీన వేతనంతో కూడిన సెలవుగా ప్రకటిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. కానీ కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్టీల్‌ప్లాంటు యాజమాన్యం కాంట్రాక్టు ఏజెన్సీలకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఏజెన్సీలు ఈ అంశంపై స్పందించడం లేదని పేర్కొన్నారు.

ఆర్‌ఐఎన్‌ఎల్, విఎస్‌పి యాజమాన్యం క్లోజింగ్ హాలిడేగా ప్రకటిస్తే కాంట్రాక్ట్ ఏజెన్సీలు కార్మికులకు జీతం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. కాబట్టి సోమవారం జరగబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌ను ప్రోత్సహించడం కోసం ప్లాంట్‌లోని ఆర్‌ఐఎన్‌ఎల్, విఎస్‌పి యాజమాన్య, కాంట్రాక్టు ఏజెన్సీలకు కూడా కాంట్రాక్టు వర్కర్లకు క్లోజింగ్ హాలిడే పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన కమిషన్ సెలవు ప్రకటించాలని, ఆదేశాలు అమలయ్యేలా చూడాలని విశాఖ జిల్లా కలెక్టరును ఆదేశించింది.





సర్వజనులకు శాంతి
స్వస్తి, సంపద, శాంతి
నే కోరు విక్రాంతి
ఓ కూనలమ్మ !

– ఆరుద్ర



ముఖచిత్రం

కళ్ళారా చూడు
భూతద్దాలు తగిలించుకో
ఓ పవిత్ర క్రతువులో నువ్వు భాగస్వామివి
తొట్రుపాటు పడతావేందీ స్వామీ..
ప్రలోభాల పాయసం తాగావా?
సరళరేఖ లేవో వక్రరేఖ లేవో
గమనించలేని దూరదృష్టి లోపించిందా?

వేలిపై సిరాచుక్క వేగుచుక్కరా బాబాయ్
ఏం చూస్తున్నావ్ కళ్ళప్పగించి
ప్రజాస్వామ్య ముఖచిత్రం పరిహాసమవుతోంది
చీము నెత్తురు వుంటే నిఖార్సుగా నిలబడు
నిటారైన వెన్నుపూసల్ని నువ్వే నిర్మించుకో
వాళ్ళంతే పీఠం కోసం కొత్త పాఠం చెబుతారు

రాజకీయ ఘస్మరులు గంట కొడుతున్నారు
తానా తందానంటూ భజన చేయకురోయ్
డబ్బు సంచుల గబ్బు వ్యూహం పన్నుతున్నారు
లౌకిక వ్యవస్థ నిండారా కునారిల్లుతోంది
మతోన్మాదం చాపకింద నీరవుతోంది
నీ టెలీఫోన్ తీగలపై ఇంకెవడో నిఘా పెట్టాడు
నిన్ను నగ్నంగా బజారులో నిలబెడుతున్నాడు
ట్రాప్... ట్రాప్.. అంతా వాడి ఉచ్చులో

నేటి ఎన్ని కలలో ఎన్ని కళలో...
జెండాలు అజెండాలు అవనతం అవుతున్నాయి
ఓటరూ జరభద్రం నువ్వే షూటరూ..
అదృశ్య ప్రాకారాల వెనుక అలవికాని ఘోరాలు
నీ వెలుతురు కళ్ల మధ్యే చీకటి కత్తులు
కప్పు గంతులు మారే కండువాలపై నజర్ పెట్టు
సమ సమాజ స్థాపనలేవీ సామ్యవాద ధోరణులేవీ
ఘనీభవిస్తున్న నీ గుండెను దివుటు చేసుకో
లిక్కరు నీళ్ళు నీపై చల్లి చుక్కలు చూపిస్తుంట్రి
శవాలను పీక్కుతినే రాబందులు
శవరాజకీయాలు చేసే గండ భేరుండాలు
విపణి వీధుల్లో విహరిస్తున్నాయి, విస్తుపోకు
కాస్తైనా నీ అగ్ని చక్షువుల్ని మండించు
సామాన్యుడి స్వప్నచ్ఛాత్రాల కింద
పేక మేడల్ని నిర్మిస్తున్న వాణ్ణి పసిగట్టు !

ఆపద్ధర్మ వాగ్దానాలు మెండుగా కేకలేస్తున్నాయి
నిజం– అబద్ధాల మధ్య వ్యత్యాసం తెలుసుకో..
సోదరా.. లోకకల్యాణ గీతికకు పీఠికలు రాయి
మాయదారి విందులకూ చిందులేయకూ
నీ హక్కుల్ని అన్యాక్రాంతం కానివ్వకూ ...

ఓయ్.. ఓటరూ నేనూ అటేపే వస్తున్నా
సిద్ధాంతంపై నిలబడ్డ నేతకు ఎర్ర తివాచీ పరువాలి
అక్కడ ఏవో సమాధులు కనిపిస్తున్నాయి
మహామహుల స్మృతి వాకిళ్ళు కావొచ్చు
పుష్పగుచ్ఛం పెట్టి క్షణం మౌనం వహించి రావాలి
ఇక్కడ ఏవో స్వార్థపు గోడలు కనిపిస్తున్నాయి
మహా మోసాల మాటల గూళ్లు కావొచ్చు
నా ఓటు వేసి వాటిని కూల్చి రావాలి...!


– డా.కటుకోఝ్వల రమేష్
99490 83327



వేలు

నీవు
నామాలు అడ్డంగానో నిలువుగానో
అభ్యంతరం లేదు
కుంకుమ కనుబొమ్మల మధ్యనో
పసుపు చెంపల కిందుగానో
అభ్యంతరం లేదు
ఔను... నీ దేహం నీది
కట్టుకి బొట్టుకి నీకు పూర్తి స్వేచ్ఛ
మేం కోరేది ఒక్కటే!
ఎడంచేయి చూపుడు వేలు మీద
నల్లచుక్క మాత్రం
దేశం కోసం గుర్తు పెట్టుకో!

– కోటం చంద్రశేఖర్, 94920 43348



నీలిచుక్కల పండుగ

ఓట్ల కోసం
నేతల గాయి గాయి గారడీలు ఆగినై
ఊకదంపుడు ఉపన్యాసాలు ఆగినై
మొసవర్రని మైకుల మొత్తుకోళ్లలో మునిగి
ఏమీ పాలుపోని జనులు ఇప్పుడిప్పుడే
లోలోన ఆలోచించుకుంటున్నరు
సూపుడేల్ల దడిగట్టి ప్రజాస్వామ్య దీపాన్ని
నీతిమాలిన నేతల సుడిగాళ్ళ నుంచి కాపాడుకోవాలని ...

ఏ రాతిరి బస్సుకో, ఏ పొద్దుటి రైలు బండికో
ఆటోనో, బైకో ఎదుంటే అది అందుకుని
ఓటేయ్యనికి ఊరోళ్ళందరు ఏడున్నా
దసరా పండుక్కి
తల్లిగారింటికొచ్చినంత సంబురంగా వద్దురు
ఓటేసినంకా సూపుడు వేలు సూపిస్తూ
బహు మురిసిపోదురు
ఈ సూపుడేలి మీది నీలి సుక్కే
రేపటి వారి బతుకు దారి సూపే మూలసుక్కని ..!

– దిలీప్.వి, 84640 30808

అడగండో.. మీరు అడగండోయ్...



పాట... హాయిగా జోకొట్టి నిద్ర బుచ్చగలదు. అగ్గి బరాటై పెను నిద్దుర వదిలించనూ గలదు. అలాంటి నిద్దురొదలగొట్టే పాటలన్నీ కలిసి ఒకచోట పోగై జనావళికి పండగ చేశాయి. శ్రమైక జీవన మాధుర్యాన్ని, సమతా, మానవతా పరిమళాలను వెదజల్లాయి. అన్యాయంపై గొంతెత్తి 'అడగండోయ్... మీరు అడగండోయ్.." అని ప్రేక్షకుని గుండెలపై డప్పుకొట్టి నినదించాయి. మేడే సందర్భాన్ని పురస్కరించుకొని, ఏప్రిల్ 27వ తేదీన "మానవుడే మహనీయుడు" అన్న మకుటంతో విజయవాడ ఎంబి విజ్ఞానకేంద్రంలో శ్రామిక సంగీత విభావరి నిర్వహించారు. పేరెన్నిక గన్న గాయనీ గాయకులు 32 శ్రామిక గీతాలను, అభ్యుదయ గీతాలను ఆలపించి, శ్రోతలను అలరించారు. శ్రమ ప్రాధాన్యాన్ని, సమైక్య బలాన్ని తమ గళాల్లో అద్భుతంగా వినిపించి, ఉత్తేజపరిచారు.

నేడు ప్రజాస్వామ్యం పరిహాసానికి గురవుతోంది. నియంతృత్వం విరగబడి నవ్వుతోంది. లాఠీలు, తూటాలు, ఈడీలు, బేడీలు, బారికేడ్లు, బాష్ప వాయువులు మట్టి మనిషిపై, అభ్యుదయంపై విరుచుకు పడుతున్నాయి. కులం, మతం, ప్రాంతం, తెగ ... ఏదైతేనేం? అన్నీ దుష్టశక్తుల చేతిలో మాయల మంత్రదండంలా మారిపోయి, జనం మధ్య అగ్ని పెట్టేస్తున్నాయి. కార్మికుడు సృష్టించిన సంపదంతా ఒళ్లు వంచని, చెమట పట్టని కొంతమంది ఖాతాల్లోకి చేరి, పోగు పడుతోంది. ఈ దురాగతాలను ఆది నుంచీ ప్రశ్నించాయి ఎన్నో మహోన్నత కలాలు. అలాంటి కలాల నుంచి జాలువారిన సాహిత్యం నిండిన మేల్కొల్పే పాటలను జనం ముందుకు తెచ్చింది జాషువా సాంస్కృతిక వేదిక.

శ్రామిక జనావళికి అరుణాంజలి ఘటిస్తూ సినీ సంగీత విభావరిని దిగ్విజయంగా నిర్వహించింది. శ్రీశ్రీ, ఆత్రేయ, సముద్రాల, ఆరుద్ర వంటి ఎందరో మహానుభావులు రచించిన ఆణిముత్యాల వంటి అభ్యుదయ, దేశభక్తి, విప్లవ గీతాలను విభావరి గొంతెత్తి గానం చేసింది. ప్రేక్షకుల మదిని మైమరపించి, ఉద్రూతలుగించి, సమరోత్సాహం నింపింది. సినీ కలాల సమతాక్షరాలను, సర్వమత సామరస్య భావాలను మనసులోకి ఇంకింపజేశారు. మేడేకు ఎర్రెర్రని సమర స్వరనీరాజనం అర్పించారు.

"భలేభలే అందాలు సృష్టించావు" అనే వేటూరి పాటతో విభావరి జనరంజకంగా మొదలైంది. "మాటలు రాని మృగాలు సైతం – మంచిగ కలిసి జీవించేను/ మాటలు నేర్చిన మా నరజాతి – మారణ హోమం సాగించేను" అంటూ... సమాజ కుళ్లు కుతంత్రాలను వేలెత్తి చూపిస్తూ 'భలే భలే అందం'గా సాగింది తొలి పాట.

"పాడిపంటలు" సినిమాలోని 'మన జన్మభూమి' పాట ఇది. "రైతుపాదమే రామపాదమని – రైతు లేనిదే రాజ్యం లేదని / నీలాకాశం నుదుటిన తిలకం – నిండుగ దిద్దుకుంటుంది" అంటున్న ఈ గేయం అన్నదాతపై యుద్ధం చేస్తున్న నేటి పాలనకు సూటి ప్రశ్న. "రాజకీయంలో కాదు. రైతు స్వేదంలో రాముణ్ని చూడమంటోంది.

ప్రేక్షకుల మదిని మైమరపించింది ఆత్రేయ రచించిన "కారులో షికారు కెళ్లే" గేయం. "మేడగట్టిన చలవరాయి – ఎలా వచ్చెనో చెప్పగలవా?/ కడుపు కాలే కష్టజీవులు – ఒడలు విరిచి గనులూ తొలిచి/ చెమట చలువను చేర్చిరాళ్లను – పేర్చినారు తెలుసుకో" అంటూ అభివృద్ధిలో శ్రమజీవుల పాత్రను కళ్లకుకట్టింది. "చాకిరొకరిదీ సౌఖ్యమొకరిది సాగదింక తెలుకో" అనే చారిత్రక సత్యాన్ని హెచ్చరికగా జారీ చేసింది.

"కుర్రాళ్లోయ్ కర్రాళ్ళూ ..." పాటతో గాయకుడు సత్యవర్ధన్ ఆడిటోరియం మొత్తాన్ని ఉత్తేజంతో ఉరకలెత్తించారు.

"గతమును పూడ్చేది వీళ్లు – చరితను మార్చేది వీళ్లు/ మనుషులే మన నేస్తాలు – మనసులే మన కోవెళ్లు/ దులుపేయ్ ఆనాటి బూజులు – మార్చి రాయి శాస్త్రాలు" అంటూ నవీన భావజాలం నిండిన ఈ గీతం ఉర్రూతలూగించి, ప్రేక్షకులచే స్టెప్పులేయించింది. ప్రజానాట్యమండలి జగన్, గుండు నారాయణరావు తదితరులు ఈ పాటకు స్టెప్పులేసి, ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. సనాతనం పేరిట ప్రచారమవుతున్న పాచిపట్టిన ప్రమాదకర భావాలను కడిగి పారేసింది పాట. "మంచిగతమున కొంచెమేనోయ్ మందగించక ముందుకడుగెయ్యమన్న గురజాడ పిలుపును గుర్తుచేసింది.

"ఎవడిదిరా ఈ భూమి/ ఎవ్వడురా భూస్వామి" గీతం చాలా హుషారుగా సాగింది. "విశాఖ ఉక్కును.. ఆంధ్రుల హక్కును ... ఎవ్వడురా అమ్మేదీ... ఎవ్వడురా కొనేది.." అని ప్రస్తుతం రాష్ట్రంలో మార్మోగుతున్న సుద్దాల అశోక్ తేజ ఉద్యమ గీతాన్ని గుర్తు చేసింది.

"పంచముణ్ని సృష్టించిన ఆ వంచకుడెవడని అడగండోయ్.../ నరకబడిన శంభూకుని శిరం సాక్షిగా/ తెగిపడిన ఏకలవ్య బొటనవేలు సాక్షిగా/ అడగండోయ్... మీరు అడగండోయ్.." కులం కుతంత్రాన్ని నిలబెట్టి నిలెయ్యాలని పిలుపునిచ్చింది ఈ రచన.

"నీ సంఘం, నీ ధర్మం, నీ దేశం నువు మరువద్దు" అంటూ సాగిన పాట అభ్యుదయ భావాలను పలికించింది. "చాపకూడుతో సమతను నేర్పెను నాటి పలనాటి బ్రహ్మన్న/ మేడిపండులా మెరిసే సంఘం గుట్టువిప్పెను వేమన్న/ వింతవుల విధి వ్రాతలు మార్చి బతుకులు పండించె కందుకూరి/ తెలుగు భారతిని ప్రజల భాషలో తీర్చిదిద్దెను గురజాడ" అని సంఘ సంస్కర్తల త్యాగాలనురాగాలను గుర్తు చేసింది. వారి కృషి ఫలాలను నేడు అనుభవిస్తున్న నువ్వు నీ మానవతా ధర్మాన్ని మరువొద్దని మనిషిని మేల్కొల్పింది.

"ఎవరికీ తల వంచకు" పాట కర్తవ్యాన్ని బోధించింది. "చాలీచాలని జీతంతో – మిడిమేలపు కొలువులు కొలవకు / ముడుచుకుపోయిన ఆశలతో – మిడిమిడి బతుకును గడపకు/ చిరునవ్వులతో విష వలయాలను ఛేదించు" అంటూ దినదినమూ ఆశనిరాశల మెరుపులో పరుగులు తీసి, అలసి నాలుగు గోడల మధ్య, నాలుగు కోళ్ల మంచంపై ముసుగేసుకు నిద్దరోతున్న పౌరుణ్ని తట్టిలేపింది ఈ పాట. నీకు నువ్వే అనుకోక సంఘటిత శక్తిలో కలవమని, అదే నీకు నిజమైన బలమని గుర్తెరగమని ప్రబోధించింది.


'నాంపల్లి టేసను కాడా రాజాలింగో' పాట సోలో గీతంగా సాగి, ప్రేక్షకులను అలరించింది. "తిందామంటే తిండీలేదు – ఉందామంటే ఇల్లూలేదు/ చేద్దామంటే కొలువూ లేదు – పోదామంటే నెలవూ లేదు" అంటూ ప్రస్తుత 'రామరాజ్యం' తీరును చూడమంది. మరి "ఉలకావేమీ పలకావేమీ – బండారాయిగ మారిన సామీ ..." అని మానవ నిస్తేజానికి రెండు చురకలు కూడా వేసింది.

శ్రీశ్రీ విరచిత గీతం "పాడవోయి భారతీయుడా"ను ఉత్తేజకరంగా పాడి వినిపించారు గాయకులు. "సమ సమాజ నిర్మాణమే నీ ధ్యేయం / సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం/ ఏకదీక్షతో గమ్యం చేరిననాడే/ లోకానికి మన భారతదేశం / అందించునులే శుభ సందేశం" భావయుక్తంగా పాడారు. సకల జనులు సుఖసంతోషాలతో ఉన్ననాడే నిజంగా భారత్ వెలిగిపోతుందని బల్లగుద్ది చెప్పింది గేయం. అలాంటి సమాజాన్ని నిర్మించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం అని ఉద్బోధించింది.

ఇంకా ఎన్నో ఉత్తేజకరమైన, ఉత్సాహపూరితమైన గీతాలతో జనరంజకంగా సాగింది శ్రామిక సినీగీతాల సంగీత విభావరి. "ఆడవే జలకమ్ములాడవే", "వందేమాతర గీతం వరస మారుతున్నది", "నేడే మేడే", "నీ పాదమ్మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా", "పుణ్యభూమి నా దేశం నమో నమామి", "మనవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువా", "అదిగో నవలోకం", "ఏరువాకా సాగరో రన్నో చిన్నన్నా", "నమ్మకు నమ్మకు ఈ రేయిని" వంటి ఎన్నో జానపదాలు, అభ్యుదయ గీతాలను వినసొంపుగా వినిపించి, ప్రేక్షకుల మదిలో సమరోత్సాహం నింపింది విభావరి. పాటల నేపథ్యాన్ని, ఆ సినిమా విశేషాలను చక్కగా పరిచయం చేస్తూ, అద్భుత వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని నడిపించారు కళా వాచస్పతి డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల. మధుర గాయనీగాయకులు సత్యవర్ధన్, రసూల్ బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, గొట్టిపాటి రామారావు, పావని, విష్ణుప్రియ తమ గళసీమల్లో పాటలను ప్రవహింపజేశారు. సమయోచితంగా సాధిస్తూ, చక్కని సంగీత సహకారాన్ని అందించారు వాయిద్య కళాకారులు. కీ బోర్డుతో రవి, ప్యాడ్స్‌తో రమణ, తబలాతో వెంకట్, జాజ్ డ్రమ్స్‌తో బాలు, రిథమ్స్‌తో రామ్మోహన్ సంగీత విభావరిని రక్తి కట్టించారు. సౌండ్ సిస్టమ్‌ని నరేష్ నిర్వహించారు. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి డ్రీమ్ ఆడియో నిర్వహణ నేతృత్వం వహించింది. పాపులర్ షూమార్ట్స్, తాళ్, సుశీల్ మీడియా, కామ్రేడ్ గోళ్ల రాధాకృష్ణమూర్తి, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి సహకారం అందించాయి. కార్యక్రమాన్ని పాపులర్ షూమార్ట్స్ అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్ ప్రారంభించారు. గుండు నారాయణరావు, రాజు తదితరుల నిర్వహణలో మధ్య మధ్య గోళ్ల నారాయణరావు, పిన్నమనేని మురళీకృష్ణ వంటి అభ్యుదయకాముకులు సందేశాలను వినిపించారు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక వర్గపు సౌభాగ్యానికి, సమర్పణంగా, సమర్చనంగా సాగిన ఈ శ్రామిక గీతాల సంగీత విభావరి ఒక ఉత్తేజకర ప్రయోగం. అభ్యుదయ గీతాలకు అరుదైన నీరాజనం!

– ఎల్.శాంతి
76800 86787

ప్రజాస్వామ్య రక్షణకై కవితాస్త్రాలు



ఎప్పుడో చూసిన పాత సినిమాలోని ఒక డైలాగు గుర్తుకొస్తోంది.. "దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది.." అనేది ఆ డైలాగ్. నూతన్ ప్రసాద్‌కి అదొక ఊతపదం ఆ సినిమాలో. హాస్యం కోసమే ఆ మాటని ఆ నటుని చేత దర్శకుడు పలికించినా ఇప్పుడా మాట వాస్తవం అని ప్రతివారూ ఒప్పుకుంటారు. నిజంగానే దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. భయమేస్తుంది కూడా. 'ఇలాగే కొనసాగితే ...' అనే ఆలోచనే ఆందోళన కలిగిస్తోంది. దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? అనే సందేహం. అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందా అనిపిస్తోంది వర్తమాన పరిస్థితులను గమనిస్తుంటే. ప్రశ్నించే గొంతుల్ని అణచివేయడానికి, లేదా కటకటాల వెనక్కి పంపించడానికి ఏమాత్రమూ వెనకాడని పాలకుల తీరు ప్రజాస్వామ్య ప్రేమికులకు మింగుడు పడటం లేదు. సిబిఐ, ఇడి వంటి సంస్థలు పాలకుల చేతిలో అస్త్రాలుగా మారిపోతున్న సంఘటనలు మేధావులను కలవరపరుస్తున్నాయి. ఎన్నికల ముందు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రివాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను సీజ్ చెయ్యడం, బడా పెట్టుబడిదారుల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పొందిన లబ్ది వంటి చర్యలు కేంద్ర పాలకుల నిరంకుశ విధానాలను స్పష్టం చేస్తున్నాయి.

"నమో" అంటూ శరణుజొచ్చిన ఆర్థిక నేరస్తులూ, దోపిడీదార్లూ పరిశుద్ధులైపోయి పదవులు వెలగబెడుతుంటారు. కటకటాల్లో శిక్షలనుభవించే దుష్టులు విడుదలై సన్మానాలు పొందుతుంటారు. ధర్మపరిరక్షకులమని చట్టాన్ని చేతిలోకి తీసుకునేవారి దౌర్జన్యాలకు అంతూ దరీ ఉండదు.

కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజాశ్రేణుల శాంతికి విఘాతం కలిగిస్తూ, మీడియాను గుప్పెట్లో పెట్టుకుని, చీకటి చట్టాలతో ప్రజాస్వామ్యాన్ని మంటగలిపి, బలిసిన బడా వ్యాపారులకు జాతి సంపదలను కట్టబెట్టే దుర్మార్గ పాలనకు చరమగీతం పాడకపోతే 'మణిపూర్' వంటి ఘటనలు ఇంకెన్ని పునరావృతమౌతాయో! ఇలా చెప్పుకుంటూ పోతే అప్పుడే ముగింపు దొరకదని నా భయం.

ఈ విపత్కర పరిస్థితులను అర్థం చేయిస్తూ పాఠకుల అవగాహనను పెంచేందుకు అజ శర్మ గారు చేసిన ప్రయత్నం బాగుంది. "ప్రజాస్వామ్యానికే ఓటు" పేరిట ఇటీవల చిన్న కవితల సంకలనం వెలువరించారు. చిన్న చిన్న పదాలతో, సూటిగా, స్పష్టంగా, సరళ సుందరంగా, కొండొకచో వ్యంగ్యంగా సూదిమొనల వంటి కవితల్ని అస్త్రాలుగా ప్రయోగించడం సరైన సమయంలో సరైన సమర వ్యూహం. పెద్ద పెద్ద బరువైన, లోతైన వ్యాసాల్లో చర్చించాల్సిన సమస్యల్ని క్లుప్తంగా అందించి అర్థం చేయించే ప్రయత్నం అభినందనీయం.

ప్రశ్నించడమూ, అవగాహనను పెంచడమూ, ఆలోచింపజేయడమూ సాహిత్య ప్రయోజనం అనుకుంటే ఆ పనే చేస్తుందీ పుస్తకం. శైలీ, శిల్పం ఇంకా ఏవేవో తూకపురాళ్ళతో తూచే కన్నా వీటిని పాఠకలోకానికి అందించడం ప్రయోజనకరంగా ఉంటుందని నమ్ముతాను. చూడండి, ఈ చిన్ని అస్త్రం ఎంత పదునుగా ఉందో ...

సంపద
కార్పోరేట్లకు అంకితం
విగ్రహాలు
జాతికి అంకితం
వనరులు
అదానీకి అంకితం
మాటలు
ప్రజలకు అంకితం
చేతలు
అస్మదీయులకు అంకితం
భక్తి
దేశానికి అంకితం
పదవి
తమకే అంకితం.

మచ్చుకొకటిమాత్రమే ఇది. ఇలాటి అస్త్రాలతో నిండిన అమ్ములపొది ఈ పుస్తకం. అస్త్రాలు చిన్నవే గానీ లక్ష్యాన్ని ఛేదించడంలో గురి తప్పవని నా నమ్మకం. రోజుకొక అస్త్రంగా అరవై ఒక్క అస్త్రాలు అరాచక చక్రవర్తిపై ప్రయోగించిన అజశర్మ గారు నిజంగా అభినందనీయులు. ఇవి చదివేక 'దేశం క్లిష్ట పరిస్థితిలో ఉంది' అని ఆ సినిమా డైలాగు గుర్తు చేసుకోకుండా ఉండగలమా? మళ్ళీ ఇదే పాలన రాకూడదనీ, రాకుండా చెయ్యాలనీ ప్రతిజ్ఞ తీసుకోకుండా ఉండగలమా?

– గంటేడ గౌరునాయుడు

విప్లవ విస్ఫులింగం

తెలవారని బతుకుల
ఈ చీకటి సావాసం
వెలుగు చూడని కలలతో
పదే పదే ఉలిక్కిపడుతోంది
కాయలు కాచిన కనుపాపల్లో
నిరాశ పొర చూపును కప్పేసింది
అణిచివేత కప్పేసిన నల్లని నీడల్లో
స్వేచ్ఛారూపం కనుమరుగైంది
దిగులును దిగమింగే గొంతుకలలో
అచేతనం గుటకై పోయింది
గాయపడిన గుండె నొకసారి
గర్జించ నివ్వండి...
కళ్ళు తిరిగి పడిపోయినా
అచేతనంపై అభ్యుదయపు నీళ్లు చల్లండి
బెదురుతనపు కయ్యోడ్పులను
బలమైన పిడికిలిగా బిగించండి
ఆ పెత్తందార్లపై విప్లవ
విస్ఫులింగాలను రువ్వండి....

– దాసశ్రీ
83283 83608

ప్రజా తీర్పు

ఓటరు మిత్రులారా, తస్మాత్ జాగ్రత్త
అక్షరం తెలిసిన వాడికి వెలుగు కలం
పద్దెనికి నిండిన అందరికి ఓటు బలం
కులం, గోత్రం చూస్తే అదే మన మలం
మనం దేనికి లొంగిన మనకి అపజయం
నేటి భారతంలో ఓటరే రేపటి జయం
సమ సమాజాన్ని మార్చేది చదువు
నిరుపేద జీవితానికి మార్పు ఓర్పు
ప్రజా జీవితాన్ని మార్చేది ఓటు
ప్రజా ఓటు కత్తి కన్నా పదునైనది
బలవంతుడికి బలహీనుడు ఎప్పుడూ లోకువే
ఎవ్వరికి భయపడి ప్రజాస్వామ్యానికి ద్రోహం చేయకు
నేటి ప్రజా భారతంలో కురుక్షేత్రం
ప్రతి ఓటరూ ఒక సైనికుడు
యుద్ధ భూమిలో నిశ్శబ్ద యుద్ధం
గన్ను, పెన్ను, కత్తి అవసరం లేదు
నీ చూపుడు వేలే అన్నీ నీకు
ఓటే మన హక్కు, ఓటే మన విజయం
నేడే మరువకు ఓటు నా సోదరా!

– తుళ్ళూరు రవి,
99599 77393

నయా నాయకులు

ఎన్నికలు రాగానే
ప్రజలే మాకు దేవుళ్ళంటారు
ఎన్నికలవగానే మా నాయకుడే
మాకు దేవుడంటారు
అడవి మన సంపదంటారు
అధికారం రాగానే అడ్డగోలుగా దోచేస్తారు
నదులకి హారతులిస్తారు
నదిలోని ఇసుకను తోడేస్తారు
ప్రజలకు సేవ చేయటం కోసమే
రాజకీయాల్లోకి వచ్చామంటారు
కానీ, శవాలతో రాజకీయం చేస్తారు

ఓటుని నోటుతో కొని అందలమెక్కుతారు
పేదరికాన్ని రూపుమాపుతామంటారు
మార్పు మొదలైందంటారు
మసిపూసి మారేడుకాయ చేస్తారు
మతాల పేరుతో మంటలు రేపుతారు
కులాల పేరుతో కుట్రలు పన్నుతారు
ప్రజలను కళ్ళున్నా గుడ్డివాళ్ళని చేస్తారు

అన్నీ ఉచితమంటారు
అందల మెక్కగానే
నిత్యావసర ధరలు పెంచుతారు
కరెంటు ఛార్జీలు పెంచుతారు
పెట్రోల్ రేట్లు పెంచుతారు
పెంచిన రేట్లతో సామాన్యుల నడ్డి విరగ్గొడతారు

ఐదేళ్లకొకసారి వచ్చే
ఈ ఎన్నికల సమరంలో
అభివృద్ధికి ఓటెయ్యాలో
నీతికి ఓటెయ్యాలో
అవినీతికి ఓటెయ్యాలో
అంతిమ నిర్ణయం ప్రజలదే!
నిర్ణయించేది ఈరోజే!

– కోనేటి నరేష్,
84998 47863

చూపుడు వేలు

1
చూపుడు వేలు
ఆతృతతో ఎదురు చూస్తోంది
చెరగని సిరా చీర కట్టి
సింగారించుకోవాలని ...
2
ఎన్నికల రోజు
చెరగని సిరా గుర్తుతో
అలంకరించుకున్న
రెండు చూపుడు వేళ్ళు
నవ్వుతూ పలకరించుకున్నాయి
3
ఎన్నిక ముగిసింది
బోసిపోయిన చూపుడువేలు
భవిష్యత్తును తలుచుకొని
నేల చూపులు చూస్తుంది!
4
ఓటేసిన జంట
చూపుడు వేలిని పైకెత్తి
వెలుగుతున్న సూర్యుడిని
చూసి మురిసింది!
5
చూపుడు వేలు
గర్వంతో తలెత్తుకుంది
ఎలాంటి ప్రలోభాలకు
తలొగ్గలేదని ...
6
చూపుడు వేలు
తెగ సంబరపడుతుంది
మచ్చలేని మనిషికి
ఓటేశానని...!

– గంగాపురం శ్రీనివాస్
96763 05949

ప్రశ్న

'ప్రశ్న' నీకెంత ధైర్యం
భూమిని చీల్చుకు పుట్టే విత్తనంలా
తూర్పున ఉదయించే సూర్యుడవై
బూడిద నుంచి మళ్లీ పైకెగిరే ఫినిక్స్‌లా
మనుషుల మనోఫలకాలపై
ఉద్యమిస్తూనే ఉంటావు

నీ మనోధైర్యాన్ని దెబ్బ తీయడానికి
దేశద్రోహి, తుక్డే తుక్డే గ్యాంగ్
అర్బన్ నక్సల్, చివరాఖరికి
పాకిస్తానీ, ఖలిస్తానీ అని కూడా
అంటాం

నిన్ను బెదిరించడానికి
ముష్టిఘాతాలు, మూకదాడులు
కంకరలు, కత్తులు, కటారులు
తుపాకులు, తూటాలు
పాలుపంచుకుంటాయి
నిన్ను నిలువరించడానికి
తాడా, పోటా, ఊపాలాంటి
చట్టాలుంటాయి
తీహార్, ఎరవాడ, అండమాన్
అండర్ సెల్‌లు అందుబాటులో
ఉంటాయి
నీకు సంకెళ్లు వేయడానికి



ఏడు పదుల వయసు అడ్డు కాదు
చక్రాల కుర్చీలు అన్న కనికరం రాదు
దీర్ఘకాల రోగులన్న దృష్టుండదు
మేధావి వర్గమున్న మనసే రాదు

ఆదిలో అణచాలన్న ఆలోచన మాది
ప్రజల దశ దిశ మార్చాలన్న దూరదృష్టి
నీది
పాలక పక్షం మేము, ప్రజల పక్షం నీవు
అయినా..! ప్రశ్న నీకు
అదురు బెదురు అసలే లేవు
ప్రశ్నా, నీకెంత ధైర్యం
మనసును చీల్చుకొని మొలకెత్తుతూనే
ఉంటావు!

– డా.ఎడ్ల కల్లేశ్
98668 65126

ఓటేసే ముందు ...

ప్రజా ప్రభూ!
ప్రజాస్వామ్య దేశంలో
రాజ్యమూ నీదే,
దాన్ని తీర్చిదిద్దే బాధ్యతా నీదే
సేవకుల నియమించు కీలక సమయాన
నీ శక్తిని మర్చిపోకు ఆసక్తిని విడిచిపోకు
నీ ప్రతినిధి ఎంపికలో
నిర్లిప్తత చూపబోకు
నమ్మించి ముంచే వారిని
ఓ కంట గమనించు
మేలెంచిన మంచి వారిని
ఎంచుకొని దీవించు!

సిరాముద్ర రాజముద్రికను ధరించే వేళ
ఏమరుపాటు వహించబోకు
అనర్హులకు ఆసనమేస్తే
తలరాతలు తారుమారు
స్వార్థ పరులకు ఆయుధమిస్తే
నీ భవితకు శిరచ్ఛేదనం
అందుకనే, ఆలోచించు
ప్రచారార్భాటాల నడుమ
ప్రశాంత చిత్తంతో
విచక్షణ జ్ఞానంతో ఆలోచించు
అర్హుడనే గెలిపించు
నీ చూపుడు వేలితో శాసించు
రాజ్యమూ నీదే.. బాధ్యతా నీదే!

– డా.డి.వి.జి. శంకరరావు,
94408 36931

భారత్ పేద దేశమే



నిరుపేదల తిండి తిప్పలు (ఫైల్)

- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా పరిస్థితి మారదు
- 140 కోట్ల జనాభా కారణంగానే మనది పెద్ద ఆర్థిక వ్యవస్థ
- అంతే తప్పితే ఆనందించటానికి ఏమీ లేదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

న్యూఢిల్లీ : గత 20 ఏళ్ల పాలనను చూస్తే రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు చెరో పదేండ్లు పాలించాయి. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు పార్టీలూ దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రధానంగా దృష్టి సారిస్తామని చెప్తున్నాయి. ఇక మోడీ సర్కారు అయితే తమ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేరిందని చెప్పుకుంటున్నది. ప్రస్తుతం భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా ఉన్నది. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా తీర్చి దిద్దుతానని మోడీ చెప్తున్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం మోడీ తన మాటలతో ప్రజలను నమ్మించే యత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నది. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి చిదంబరం మాత్రం అలా చేయడం గణాంకాల వరకే పరిమితంగానీ, ఆచరణ సాధ్యం కాని విషయమని అన్నారు.

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) ప్రకారం.. కొంతకాలంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ ఉన్నది. 2023 ఆర్థిక సంవత్సరంలో దాని వృద్ధి రేటు 7.2 శాతంగా ఉన్నది. ఇది జీ20 దేశాలలో రెండో అత్యధికం. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థల సగటు కంటే దాదాపు రెండింతలు.


ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకారం.. వచ్చే నెలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదనీ, ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలంలో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా. "మోడీ ప్రభుత్వం మళ్లీ మూడోసారి ఏర్పాటవుతుంది. ప్రధాని ప్రకటన ప్రకారం వచ్చే ఏడాది లేదా మరి కొంత కాలంలో ఐదో స్థానం నుంచి భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకుంటుంది" అని రాంచీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె చెప్పారు. వచ్చే మూడేళ్లలో (2027 నాటికి) భారత్.. జపాన్, జర్మనీలను అధిగమించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంటుందని తెలిపారు. అయితే, గత నవంబర్‌లో ఆమె చేసిన మునుపటి అంచనాతో ఈ లక్ష్యం విరుద్ధంగా ఉన్నదని నిపుణులు అంటున్నారు. గత నెలలో విడుదల చేసిన ఐఎంఎఫ్ ప్రపంచ ఆర్థిక నివేదిక ప్రకారం.. భారత్ ప్రస్తుతం 2023లో 3.6 ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తితో ఐదో స్థానంలో ఉన్నది. జర్మనీ, జపాన్ వరుసగా 4.45 ట్రిలియన్ డాలర్, 4.21 ట్రిలియన్ డాలర్లతో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. అయితే, 2024లో భారత జాతీయ ఉత్పత్తి 3.9 ట్రిలియన్ డాలర్లకు పెరగవచ్చు. అయితే, జపాన్ ర్యాంకింగ్ 4.1 ట్రిలియన్ డాలర్లకు తగ్గిపోయినప్పటికీ.. భారత్ ర్యాంకింగ్ స్థిరంగా ఉంటుంది. వాస్తవానికి, 2025లో భారత్..జపాన్‌ను అధిగమించి 4.4 ట్రిలియన్ డాలర్ల ఉత్పత్తితో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటుందనీ, జపాన్ ఆర్థిక వ్యవస్థ 4.3 ట్రిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో స్థిరపడుతుంది.

మూడో ఆర్థిక వ్యవస్థకు చేరాలంటే అంత సులువు కాదన్న విషయాన్ని చిదంబరంతో పాటు ఆర్థిక నిపుణులూ వినిపిస్తున్నారు. 2025 నాటికి ఉంటుందని సీతారామన్ చెప్తున్నప్పటికీ అదంత సులువేం కాదని అంటున్నారు. ఐఎంఎఫ్.. భారత్.. జర్మనీని అధిగమించి 2027 నాటికి మూడో స్థానానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నది. అయితే కొంతమంది ఆర్థికవేత్తలు దీనిని 2029 తర్వాత మాత్రమే సాధించగలమని అంచనా వేస్తున్నారు.

అయితే, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గణాంకాలు ఎలా ఉన్నా.. దేశంలో మాత్రం పేద, మధ్య తరగతి ఆర్థిక స్థితిగతులు మాత్రం మారటం లేదని నిపుణులు అంటున్నారు. ఇప్పటికీ, దేశంలోని అనేక మంది ప్రజలకు తినటానికి సరైన తిండి దొరకటం లేదనీ, ఉండటానికి నివాసమూ లేదని చెప్తున్నారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ప్రకారం.. మనం ఎప్పుడు మూడో స్థానానికి చేరుకున్నా, ఆనందించటానికి మాత్రం ఎలాంటి కారణమూ లేదు. ఎందుకంటే, భారత్ పేద దేశంగా మిగిలిపోయే అవకాశం ఉన్నది. "నా అభిప్రాయం ప్రకారం.. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారటం సాధ్యమే. కానీ ఇది వేడుక కాదు. ఎందుకంటే.. 140 కోట్ల జనాభా ఉన్నందున మనం పెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రజలు ఉత్పత్తికి కారకులు. కాబట్టి మనం పెద్ద ఆర్థిక వ్యవస్థ ఎందుకంటే మనకు ప్రజలు ఉన్నారు. కానీ మనది ఇప్పటికీ పేద దేశమే.." అని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రముఖ జర్నలిస్టు బిపిన్ చంద్రన్ హఠాన్మరణం

- సిపిఎం దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ/తిరువనంతపురం : ప్రముఖ జర్నలిస్టు, సిపిఎం సోషల్ మీడియా విభాగం కార్యకర్త బిపిన్ చంద్రన్ (50) ఆదివారం హఠాన్మరణం చెందారు. బిపిన్ సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు ఎస్ రామచంద్రన్ పిళ్లై కుమారుడు. మూడు రోజుల కిందట ఇంటర్నల్ ఆర్గాన్స్ దెబ్బతినడంతో బిపిన్‌ను తిరువనంతపురం వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం ఆసుపత్రిలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సోమవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు.

కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జి అదనపు వ్యక్తిగత కార్యదర్శి గాను, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ వికె రామచంద్రన్ వ్యక్తిగత కార్యదర్శిగానూ బిపిన్ సేవలందించారు. సుదీర్ఘకాలం ఢిల్లీలో పాత్రికేయ జీవితం గడిపిన బిపిన్..ఎంట్రప్రెన్యూర్ బిజినెస్ మ్యాగజిన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ పని చేశారు. బిజినెస్ స్టాండర్డ్, ఫైనాన్షియల్ టైమ్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థల్లో వివిధ హోదాల్లో పాత్రికేయ సేవలందించారు. అనంతరం సిపిఎం సోషల్ మీడియా విభాగంలో కేంద్ర కార్యాలయంలో పని చేశారు. బిపిన్‌కు భార్య షయీజా (జర్నలిస్టు, ఢిల్లీ), పిల్లలు ఆదిత్య పిళ్లై (ఫైనాన్షియల్ ఎనలిస్టు, బెంగళూరు), ఆరోహి పిళ్లై (విద్యార్థి, పూణే) ఉన్నారు.

50 ఏళ్ల చిరుప్రాయంలోనే బిపిన్ హఠాన్మరణం చెందడం పట్ల సిపిఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సిపిఎం సోషల్ మీడియా విభాగం ప్రారంభించిన తొలినాళ్లలో బిపిన్ కేంద్ర కార్యాలయంలో విశేష సేవలందించారని స్మరించుకుంది. నిత్యం కొత్త ఆలోచనలతో, సహచరుల అభిప్రాయాలను గౌరవిస్తూ బృందాన్ని నడిపించేవాడని కొనియాడింది. తనయుడిని కోల్పోయిన వేళ ఆయన తండ్రి, సీనియర్ నేత ఎస్ రామచంద్రన్ పిళ్లైకి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

పూర్తి వివరాలు విడుదల చేయండి

- ప్రతి దశ పోలింగ్ తర్వాత ప్రెస్ మీట్ పెట్టండి
- ఎన్నికల కమిషన్‌కు పాత్రికేయ సంఘాల లేఖ

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరంలో మూడు దశలు ముగిసినప్పటికీ ఒక్క పత్రికా విలేకరుల సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడంపై ఐదు పాత్రికేయ సంఘాలు ఈసీపై మండిపడ్డాయి. ఈ మేరకు ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్పొరేషన్, ప్రెస్ అసోసియేషన్, విదేశీ కరస్పాండెంట్ల క్లబ్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ సంయుక్తంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఓ లేఖ రాశాయి.

గత మూడు దశల ఎన్నికల్లో కచ్చితంగా ఎన్ని ఓట్లు పోల్ అయిందీ ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకూ వెల్లడించలేదని ఆ సంఘాలు తమ లేఖలో గుర్తు చేశాయి. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని అంటూ దిగ్భ్రాంతిని, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాయి. ఈ పరిణామాలు నిష్పాక్షిక ఎన్నికలపై ప్రజల మనసులో ఆందోళనలు రేపాయని తెలిపాయి.

'2019 ఎన్నికల వరకూ ప్రతి దశ పోలింగ్ ముగిసిన తర్వాత విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా ఉండేది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ నుండి ఓటింగ్ జరిగిన రోజు ఏం జరిగిందో తెలుసుకునే హక్కు పౌరులకు ఉంది. పోలింగ్ ముగిసిన తర్వాత విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వారి అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసేవారు. దీనివల్ల పత్రికా పాఠకులకు పౌరబాట్లకు అవకాశం లేని సమాచారం అందేది' అని పాత్రికేయ సంఘాలు ఆ లేఖలో వివరించాయి. ప్రతి దశ పోలింగ్ తర్వాత విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఓట్ల శాతం ఎంత వంటి వివరాలన్నీ అందజేయాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కలగాలంటే ఇలాంటి పారదర్శకత అవసరమని నొక్కి చెప్పాయి.



జార్ఖండ్ మంత్రి అలంగిర్‌కు ఇడి సమన్లు

రాంఛీ : జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత అలంగిర్ ఆలం(70)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు ఆదివారం నాడు వెల్లడించారు. మనీలాండరింగ్ కేసులో తమ ముందు విచారణకు హాజరుకావాలని ఆయనను ఇడి ఆదేశించింది. ఈ కేసులో ఆలంగిర్‌కు సంబంధించిన ఒక ఇంటిలో రూ.32 కోట్ల నగదు ఇటీవల ఇడి స్వాధీనం చేసుకుంది. ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్‌ను, ఇంటి సహాయకుడిని కూడా అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాంఛీలోని ఇడి జోనల్ కార్యాలయంలో మంగళవారం జరిగే విచారణకు హాజరవ్వాలని ఆలంకు పంపిన సమన్లలో పేర్కొన్నారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఇ) కింద ఆయన వాగ్మూలాన్ని ఇడి అధికారులు రికార్డు చేయనున్నట్లు తెలిసింది. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు ఇడి ఆరోపిస్తోంది. అయితే తనకు సంజీవ్ లాల్ జరిపిన లావాదేవీలతో సంబంధం లేదని ఆలం పేర్కొంటున్నారు. ఈ కేసు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి సంజీవ్‌ను ఆయన దూరం పెట్టినట్టు తెలుస్తోంది.



6 నెలల తర్వాత తెరుచుకున్న బద్రీనాథ్ ఆలయం

డెహ్రాడున్ : ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. ఆరు నెలల తర్వాత సాంప్రదాయ డప్పు, నాదస్వర వాయిద్యాల మధ్య బద్రీనాథ్ ఆలయ తలుపులను ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో పూజారులు తెరిచారు. దీంతో చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ప్రారంభమైంది. చార్‌ధామ్ యాత్రలో బద్రీనాథ్, కేదార్ నాథ్, యుమునోత్రి, గంగోత్రి ఆలయాలను యాత్రికులు సందర్శిస్తారు. కేదార్‌నాథ్, యుమునోత్రి, గంగోత్రి ఆలయాల తలుపులను అక్షయ తతీయ సందర్భంగా గత శుక్రవారమే తెరిచారు. అధికారిక సమాచారం ప్రకారం కేదార్‌నాథ్‌ను తొలి రోజు రికార్డు స్థాయిలో దాదాపు 29 వేల మంది సందర్శించారు. శనివారం సాయంత్రం 4 గంటల వరకు 7,37,885 మంది బద్రీనాథ్ సందర్శన కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. గతేడాది 18,39,591 మంది ఆలయాన్ని సందర్శించారు.

ఇండోనేషియాలో భారీ వర్షాలు

- 28 మంది మృతి

జకర్తా : ఇండోనేషియాలోని పశ్చిమ సుమత్ర రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా సంభించిన వరదలు, కొండచరియలు విరిగిన ఘటనల్లో 28 మంది చనిపోయారు. మరో నలుగురు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు ఆదివారం వెల్లడించారు. గల్లంతైన నలుగురి కోసం గాలింపు చర్యలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నట్లు తెలిపారు. వరదల కారణంగా శనివారం రాత్రి నుంచి నివాస ప్రాంతాల్లో భారీ స్థాయిలో బురద కొట్టుకొచ్చినట్లు పేర్కొన్నారు. కనీసం ఐదు జిల్లాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉందని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. భారీ వర్షాలకు సుమారు 84 ఇళ్లు, 16 వంతెనలు ధ్వంసమయ్యాయని ప్రకటించింది.

10 రాష్ట్రాలు.. 96 లోక్‌సభ స్థానాల్లో నేడు పోలింగ్

- నాలుగో విడతకు సర్వం సిద్ధం
- 17.7 కోట్ల ఓటర్లు
- 1.92 లక్షలు పోలింగ్ కేంద్రాలు



పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సోమవారం నాలుగో విడత పోలింగ్ కు సర్వసిద్ధమైంది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 96 లోక్‌సభ స్థానాలకు నేడు పోలింగ్ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 175, ఒరిస్సాలో 28 అసెంబ్లీ స్థానాలకు కూడా సోమవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అయితే తెలంగాణలో ఓటింగ్ ను బట్టి సమయాన్ని పెంచనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. 96 లోక్‌సభ స్థానాల్లో 64 జనరల్ 12 ఎస్‌టి, 20 ఎస్‌సి స్థానాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాల్లో 139 జనరల్, 7 ఎస్‌టి, 29 ఎస్‌సి స్థానాలు ఉన్నాయి. ఒరిస్సాలోని 28 అసెంబ్లీ స్థానాలలో 11 జనరల్, 14 ఎస్‌టి, 3 ఎస్‌సి స్థానాలు ఉన్నాయి. 10 రాష్ట్రాల్లో 1,717 మంది అభ్యర్థులు లోకసభ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

నేడు పోలింగ్ జరిగే 96 లోక్‌సభ స్థానల్లో 17.70 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 8.97 కోట్ల మంది పురుషులు, 8.73 కోట్ల మహిళల ఓటర్లు ఉన్నారు. 12.49 లక్షల మంది 85 ఏళ్లు పైబడి ఉన్నారు. 19.99 లక్షల మంది వికలాంగ ఓటర్లు ఉన్నారు. 1.92 లక్షల పోలింగ్ కేంద్రాలు వుండగా వాటిలో 19 లక్షల అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా 364 మంది పరిశీలకులు ఉన్నారు. అందులో 126 సాధారణ, 70 మంది పోలీసు, వ్యయ పరిశీలకులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 4,661 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 4,435 మంది స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, 1,710 వీడియో సర్వేలెన్స్ టీమ్స్, 934 వీడియో వ్యూవింగ్ టీమ్స్ ఎన్నికల పనుల్లో ఉన్నాయి. 1,016 అంతరాష్ట్ర, 121 అంతర్జాతీయ సరిహద్దుల చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీలు ఏర్పాటు చేశారు.

ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా

10 గ్యారంటీలను ప్రకటించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 'దేశానికి 10 గ్యారంటీలు'ను ఆదివారం ప్రకటించారు. నిరంతర విద్యుత్, ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా వంటి గ్యారంటీలు ఇందులో కీలకమైనవి. తనకు ప్రధానమంత్రి కావాలని లేదని, అయితే ఇండియా వేదిక ప్రభుత్వాన్ని ఏర్పాటవ్వగానే ఈ గ్యారంటీలు నెరవేరాలా చూస్తామని తెలిపారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నాయకులతో కలిసి ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పది గ్యారంటీలను ఇప్పటికే ప్రకటించాలనుకున్నా, తన అరెస్టు కారణంగా ఆలస్యమైందని కేజ్రీవాల్ చెప్పారు. ఈ గ్యారంటీల గురించి ఇండియా వేదిక నాయకులతో చర్చించలేదని, తనకు అంత సమయం లేదని, అయితే వారు భావసారుప్యత ఉన్నందున వారెవ్వరూ అభ్యంతరం చెప్పరనే నమ్మకం తనకుందని కేజ్రీవాల్ తెలిపారు. 'ఈ పది గ్యారెంటీలు భారత దేశ విజన్ లాంటివి. ఏ దేశానికైనా పునాది వంటివి. ఇవి లేకుండా దేశం ముందుకు సాగదు. వచ్చే ఐదేళ్లలో ఈ గ్యారెంటీలు అమలు చేస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. బిజెపిలో 75 ఏళ్లకే పదవీ విరమణ నిబంధనను తీసుకొచ్చిందని గుర్తు చేస్తూ త్వరలోనే 75 ఏళ్లు పూర్తి చేసుకోనున్న మోడీ స్థానంలో ప్రధాని అభ్యర్థి ఎవ్వరో చెప్పకుండా బిజెపి దాటవేస్తోందని చెప్పారు. దీనిపై మోడీ కూడా మౌనంగా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. 2014లో ఇదే నిబంధనతో అద్వానీని పదవీ విరమణ చేయించిన మోడీ బృందానికి ఇప్పుడు ఆ నిబంధన గుర్తుకురావడం లేదా? అని ఆయన ప్రశ్నించారు.

ఆమ్‌ఆద్మీ పది గ్యారెంటీలు ఇవే..

- 24 గంటలూ నిరంత విద్యుత్
- అందరికీ నాణ్యమైన విద్య
- అంతర్జాతీయ స్థాయి ఆరోగ్య సదుపాయాలు
- జాతీయ భద్రతకు మొదటి ప్రాధాన్యత
- అగ్ని వీర్ పథకం రద్దు
- రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర
- ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా
- ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన
- అవినీతి నిర్మూలన
- జిఎస్‌టి సరళీకరణ

ఖర్గే హెలికాప్టర్‌లో ఇసి సోదాలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే హెలికాప్టర్‌ను బీహార్‌లో ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. బీహార్‌లోని సమస్తిపూర్, ముజఫర్‌పూర్‌ల్లో ఖర్గే శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్తిపూర్‌లో ఖర్గే హెలికాప్టర్‌ను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రతిపక్ష నాయకులనే ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ నాయకులను మాత్రం ఇష్టానుసారం తిరగడానికి అనుమతిస్తున్నారని పేర్కొంది. గతంలో రాహుల్‌గాంధీ హెలికాప్టర్‌ను కేరళలో తనిఖీ చేశారని, ఇప్పుడు బీహార్‌లో ఖర్గే హెలికాప్టర్‌ను తనిఖీ చేశారని కాంగ్రెస్ పార్టీ బీహార్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజేశ్ రాథోర్ తెలిపారు. అలాగే అధికారులు తనిఖీ చేస్తున్న వీడియోను కూడా ఆయన పోస్టు చేశారు. 'కాంగ్రెస్ నాయకుల హెలికాప్టర్లను తనిఖీ చేయడం సాధారణ విషయమేనా? ఎన్‌డిఎ అగ్రనాయకుల హెలికాప్టర్లలోనూ ఇలాంటి తనిఖీలు చేశారా? ఈ విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టం చేయాలి' అని రాథోర్ ప్రశ్నించారు. 'ఇలాంటి రికార్డులన్నింటినీ ఇసి బహిరంగపరచాలి లేకుండే ఇసి ప్రతిపక్ష నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వారిని నిరోధించడానికి, ఎన్‌డిఎ నాయకులను స్వేచ్ఛగా తిరగడానికి అనుమతించినట్లు అర్థం అవుతుంది' అని పేర్కొన్నారు.

ఎస్‌ఎం కృష్ణకు తీవ్ర అస్వస్థత

బెంగళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ (92) తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో స్థానిక మణిపాల్ ఆస్పత్రిలో చేరిన ఆయన ఆదివారం మరింత తీవ్రంగా అస్వస్థతకు గురికావడంతో ఐసియు వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఏప్రిల్ 21న అస్వస్థతకు గురికావడంతో ఆయనను తొలుత బెంగళూరులోని వైదేహి ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత అదే నెల 29న మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కారంత్ నేతత్వంలోని క్రిటికల్ కేర్ టీమ్ చికిత్స అందిస్తున్నారని మణిపాల్ వైద్యులు పేర్కొన్నారు. కాగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి కృష్ణను పలకరించారు. అలాగే ఆయనకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో కీలక పదవులను అనుభవించిన ఎస్‌ఎం కృష్ణ 2004 నుంచి 2008 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికై కేంద్రమంత్రిగానూ సేవలందించారు. తర్వాత గవర్నర్ పదవిని చేపట్టారు. కొన్నేళ్ల క్రితం కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరారు. ఆ తర్వాత రాజకీయాలకు స్వస్థిపలికారు. తొంబైల్లో యాభైలా తాను ఉండలేనని అందుకే రాజకీయాలకు దూరంగా ఉండాలని అనుకుంటున్నానని అప్పట్లో ఆయన చెప్పారు.

ఆ నలుగురి సేవలో మోడీ : ప్రియాంక గాంధీ



లక్నో. దేశ సంపదను ప్రధాని మోడీ కేవలం నలుగురు బడా పారిశ్రామిక వేత్తలకు దోచిపెడుతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో ఆదివారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆమె ప్రసంగించారు. ఆ నలుగురు బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసేందుకు ప్రధాని పనిచేస్తున్నారని అన్నారు. పేదలు, రైతుల కడుపుకొట్టి పారిశ్రామిక దిగ్గజాలకు మోడీ దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ అనూహ్యంగా చేపట్టిన నోట్ల రద్దు కోట్లాది చిరు వ్యాపారులు, మహిళలకు కష్టాలు తెచ్చిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ హయాంలో ఈ పదేళ్లలో పేదల స్థితిగతులు ఏమాత్రం మెరుగుపడలేదని అన్నారు. కాషాయ పాలకులు చేసిన అరకొర పనులను వార్తా ఛానెల్స్‌లో అదేపనిగా చూపుతున్నారని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు.

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆందోళనల హోరు

ఉక్కుపాదంతో అణిచేస్తున్న పోలీసులు



పిఒకెలో టైర్లు దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజానీకం

శ్రీనగర్ : ద్రవ్యోల్బణం, అధిక పన్నులు, విద్యుత్ కొరతను వ్యతిరేకిస్తూ పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లో ప్రజాందోళనలు మిన్నంటుతున్నాయి. కొద్ది రోజులగా ఈ ప్రాంతంలో వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. శనివారం పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టడంతో పోలీసులు తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో ఒక పోలీస్ అధికారి మరణించారు. 90 మంది పైగా పౌరులు గాయపడ్డారు. జమ్ముకాశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (ఎఎసి) నేతృత్వంలో శనివారం చక్కా జామ్, సమ్మెను ప్రకటించారు. వ్యాపారులు ఈ సమ్మెలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆందోళనకారులు 'ఆజాదీ' అంటూ నినాదాలు చేపట్టారు. ముజఫరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ర్యాలీ చేపడుతున్న ఆందోళనకారులపై పోలీసులు, భద్రతా సంస్థలు విరుచుకుపడ్డాయి.

ప్రజల చట్టబద్ధమైన హక్కులకోసం శాంతియుతంగా పోరాడుతున్న తమను అప్రతిష్టపాలు చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారని అన్నారు. శుక్రవారం సమ్మెకు పిలుపునివ్వడంతో పలువురు నేతలు, యాక్షన్ కమిటీ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దద్యాల్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దౌర్జన్యానికి వ్యతిరేకంగా పిఒకె అంతటా ముఖ్యంగా ముజఫరాబాద్‌లో పూర్తి షటర్ డౌన్, వీల్‌జామ్ సమ్మెను చేపట్టనున్నట్లు ముజఫరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ చైర్మన్, కాశ్మీరీ సభ్యుడు షౌకత్ నవాజ్ మీర్ తెలిపారు. విద్యుత్ బిల్లులపై పన్నులు విధించడానిన తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. హైడల్ విద్యుత్ ఉత్పత్తికి ధరకు అనుగుణంగా వినియోగదారులకు విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. హింసతో యాక్షన్ కమిటీకి ఎలాంటి సంబంధం లేదని కమిటీ అధికార ప్రతినిధి హఫీజ్ హమ్దానీ పాక్ మీడియాకు తెలిపారు.

పెన్‌డ్రైవ్‌లో గవర్నర్ గుట్టు ..

- లైంగిక వేధింపుల వ్యవహారంలో మమత వ్యాఖ్యలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ. ఆనందబోస్‌పై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. మహిళపై లైంగిక వేధింపుల వ్యవహారంలో.. ఆనందబోస్ ఎడిట్ చేసిన వీడియోను సాధారణ పౌరులకు చూపించారని, ఒర్జినల్ వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్ తన దగ్గర ఉందని పేర్కొన్నారు. వాటిలో దిగ్భ్రాంతికర దృశ్యాలు ఉన్నాయని చెప్పారు. గవర్నర్ పదవికి ఆనందబోస్ ఎందుకు రాజీనామా చేయనక్కర్లేదో స్వయంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ తరపున హుగ్లీ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రచనా బెనర్జీకి మద్దతుగా సప్తగ్రామ్‌లో ప్రచార ర్యాలీలో మమత పాల్గొని ప్రసంగించారు. ఆనందబోస్ గవర్నర్‌గా ఉన్నంతకాలం తాను రాజ్‌భవన్‌కు వెళ్లబోనని స్పష్టం చేశారు. తప్పనిసరైతే వీధుల్లోనే ఆయన్ను కలుస్తానన్నారు. ఆనందబోస్ పక్కన కూర్చోవడం కూడా పాపమేనంటూ ఘాటుగా విమర్శించారు. "దీదీగిరిని సహించబోనని గవర్నర్ అంటున్నారు. కానీ ఆయన దాదాగిరీ ఇక పనిచేయదు. మహిళలపై వేధింపులకు పాల్పడిన ఆయన పదవి నుంచి దిగిపోవాలి" అని మమత పేర్కొన్నారు. మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు చెబుతున్న మే 2వ తేదీకి సంబంధించిన సీసీ ఫుటేజీని ఆనందబోస్ సాధారణ పౌరులకు చూపించిన సంగతి తెలిసిందే. దీనిపై బాధితురాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. వీడియోలో తన ముఖాన్ని బ్లర్ చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.


నిజ్జర్ హత్య కేసులో మరో భారతీయుడు అరెస్ట్

న్యూఢిల్లీ : ఖలిస్తాన్ వేర్పాటు వాది నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో మరో భారతీయుడిని అరెస్ట్ చేసినట్లు కెనడా పోలీసులు తెలిపారు. కెనడాలోని బ్రాంప్టన్, సర్రే, అబాట్స్‌ఫోర్డ్ ప్రాంతాలలో నివసిస్తున్న అమర్‌దీప్ సింగ్ (22)పై ఫస్ట్ డిగ్రీ హత్య, హత్యకు కుట్ర అభియోగాలు మోపారు. నిజ్జర్ హత్యలో పాత్ర ఉన్నందుకు సింగ్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు ఇంటిగ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఐహెచ్ఐటి) తెలిపింది. ఆయుధాల కేసులో ఇప్పటికే అతను పీల్ ప్రాంతీయ పోలీసుల అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు భారతీయులను కెనడా పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

అమెరికాలో ఇద్దరు తెలుగు విద్యార్థుల మృత్యువాత

న్యూయార్క్ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఇద్దరు తెలుగు విద్యార్థులు ప్రమాదవశాత్తూ జలపాతంలో మునిగి కన్నుమూశారు. ఆరిజోనా యూనివర్సిటీ నుంచి ఇటీవలే ఎంఎస్ పట్టా పొందిన లక్కిరెడ్డి రాకేశ్ రెడ్డి (23), రోహిత్ మణికంఠ రేపాల (25) సహా మొత్తం 16 మంది స్నేహితులు ఆరిజోనాలోని ప్రసిద్ధ ఫాజిల్ క్రీక్ జలపాతం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ రాకేశ్, రోహిత్‌లు జలపాతంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన చేరుకుని రాత్రి వరకు గాలించినా వారిద్దరి ఆచూకి దొరకలేదు. తర్వాతి రోజు సుమారు 25 అడుగుల లోతులో ఇద్దరి మృతదేహాలను గజ ఈతగాళ్లు గుర్తించారు. ఖమ్మం నగరానికి చెందిన మాంటిస్సోరి, తెలంగాణ నారాయణ పాఠశాలల అధినేతల్లో ఒకరైన చంద్రశేఖర్‌రెడ్డి, పద్మ దంపతుల ఏకైక కుమారుడు రాకేశ్‌రెడ్డి అని తెలిసింది. రోహిత్ మణికంఠకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేసవి విడిది




బొమ్మరిల్లు





- చరణ్,
9వ తరగతి,
నెల్లూరు.





నిజమైన స్నేహితుడు

ఇద్దరు స్నేహితులు సెలవురోజు ఊరు వెలుపలకి షికారుకెళ్లారు. తోవలో మాట్లాడుకుంటూ ఏదో విషయంపై అభిప్రాయం కుదరక వాదించుకున్నారు. వాదన ఎక్కువై మొదటివాడు రెండోవాడిని చెంపపై కొట్టాడు. దెబ్బ తిన్నవాడు అక్కడ ఇసుకపై 'ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు' అని రాశాడు. మళ్లీ ఇద్దరూ ముందుకు నడిచారు.

మరికొంత దూరం వెళ్లాక ఇద్దరికీ దాహం వేసింది. మడుగు దగ్గరకు వెళ్లారు. చెంపదెబ్బ తిన్న మిత్రుడు నీళ్లలోకి దిగాడు. అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోతుండగా గట్టునే ఉన్న స్నేహితుడు వెంటనే తన దగ్గర ఉన్న తువాలుని విసిరి పైకి లాగాడు. బయటపడిన స్నేహితుడు పైకి రాగానే అక్కడే ఉన్న బండరాయిపై 'ఈ రోజు నా మిత్రుడు నన్ను ప్రమాదం నుండి రక్షించాడు' అని చెక్కాడు.

మొదటి విషయాన్ని ఇసుకపై, రెండోదాన్ని రాయిపై ఎందుకు రాశావని మొదటి మిత్రుడు అడిగాడు. 'ఇసుకపై రాస్తే గాలి వీచినప్పుడు చెరిగిపోతుంది. స్నేహితుల మధ్య వచ్చిన పొరబాట్లను మనసులో పెట్టుకోకూడదు. ఎప్పటికప్పుడు తుడిచేసుకోవాలి. అలాగే ఆపదలో సహాయం చేసినప్పుడు శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. అందుకే నన్ను రక్షించినప్పుడు రాయిపై రాశాను' అని రెండవ స్నేహితుడు చెప్పాడు.

నీతి : స్నేహితుల మధ్య పొరపచ్చాలు వచ్చినప్పుడు వెంటనే మర్చిపోవాలి. అదే సాయం చేసినప్పుడు కలకాలం గుర్తుంచుకోవాలి.

సేకరణ : యు.రుష్మిక, 5వ తరగతి, గీతాంజలి హైస్కూలు, రెడ్డిగూడెం.



వానలు కురవాలి

వానలు కురవాలి
చిగురులు వేయాలి
ఎండలు తగ్గాలి
గాలులు వీయాలి

నేలమ్మ తడవాలి
చల్లగా వుండాలి
చెట్లు చిగురించాలి
పచ్చదనం రావాలి

విత్తులు నాటాలి
మొక్కలు మొలవాలి
వనరులు పెరగాలి
భూతాపం పోవాలి

పచ్చపచ్చని నేలంతా
ఎంతో చక్కగా వుండాలి
వేడి గాలులు తగ్గాలి
చల్లదనం పెరగాలి

వర్షాలు బాగా కురవాలి
భూమి తాపం తీరాలి
చెట్లు ఏపుగా పెరగాలి
ఎంతో హాయిగా వుండాలి





- దేవాంగం జగదీశ్వర,
96184 36520.







- పి.కమలాకర్,
9వ తరగతి,
ఎం.తిమ్మాపురం
ఆదర్శ పాఠశాల,
మహానంది.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి', 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా
వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com
- ఎడిటర్

జీవన సౌరభం
చేసే పనిలో అడ్డంకులు వస్తే
ఆపాల్సింది పని కాదు..
ప్రయత్నించే విధానం.

JEEVANA జీవన the family

నగరాలకు దూరంగా ... పల్లె'టూరు'

జీవితం ఉరుకుల పరుగులమయం అయ్యాక... నగరాల్లో, పట్టణాల్లో నివాసాలు ఇరుకిరుకుగా మారాక - స్వచ్ఛమైన గాలి కూడా కరువైపోతోంది. అందుకనే చాలామందికి విశాలమైన ప్రపంచంలోకి, కనుచూపు మేరా ఆవరించిన పచ్చదనంలోకి, జన సమ్మర్థం లేని వన సముదాయాల్లోకి వెళ్లాలనే బలమైన ఆకాంక్ష కలుగుతోంది. అలాంటి వారికి చేతులారా స్వాగతం పలుకుతున్నాయి పల్లె'టూర్లు'. సహజమైన మట్టివాసన, సెలయేర్ల గలగలల ప్రవాహం, పక్షుల కిలకిల రావాలూ ... ఇప్పుడు పల్లె పర్యటనలో ప్రధాన ఆకర్షణలుగా మారుతున్నాయి. పల్లె'టూరు' ఇప్పుడొక కొంగొత్త పర్యాటక వరవడి.

పశ్చిమ బెంగాల్‌లోని కాలింపాంగ్‌కి చెందిన కబీర్ ప్రధాన్, అహనా గురుంగ్ దంపతులు వివిధ నగరాల్లో ఉద్యోగాలు చేశారు. ఆ బిజీ బిజీ జీవితంలో వారికి ఊపిరి సలపనట్టుగా ఉండేది. ఎన్ని ఆధునిక సదుపాయాలు అందుబాట్లో ఉన్నా ఏదో వెలితి వెంటాడుతూ ఉండేది. పల్లెలో, ప్రకృతి ఒడిలో హాయిగా గడిపిన బాల్యాన్ని తరచూ నెమరు వేసుకునేవారు. వాళ్లే కాదు; వారి మిత్రులు కూడా తరచూ ఒక మాట అనేవాళ్లు.. "ఇక్కడ ఊపిరి సలపటం లేదు. హాయిగా ఎటన్నా, దూరంగా వెళ్లిపోవాలి. ఈ హడావిడి, ఈ ఒత్తిడీ లేని చోటికి వెళ్లి గడపాలి."

ఎక్కడ ఉంది అలాంటి చోటు? కబీర్‌కి, అహనాకి వాళ్ల సొంతూరు గుర్తొచ్చేది.



ఎక్కడ చూసినా పచ్చదనం, స్వచ్ఛమైన నీటితో ప్రవహించే చల్లని వాగులు, సమీపంలోనే ఎత్తయిన పర్వత శ్రేణులు, అంబా అని మోరమెత్తే దూడల దూకుళ్లు, పక్షుల కిచకిచలూ గుర్తొచ్చేవి. ఆ ఊరినే ఒక పర్యాటక స్థలిగా మారిస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచించారు. 'బాగుంటుంది. చాలా బాగుంటుంది.' అనుకున్నారు ఇద్దరూ. వెంటనే ఓ ప్రణాళిక తయారు చేసి, దానిని ఆచరణలో పెట్టారు.

కబీర్‌కి తన సొంతూరు వ్యవసాయ భూములు ఉన్నాయి. అక్కడ సాంప్రదాయ పద్ధతుల్లో మట్టి, వెదురు ఉపయోగించి, రెండు గదుల ఇళ్లను నిర్మించాడు. చూడచక్కగా, చల్లగా ఉండేలా గ్రామీణ నిర్మాణ పద్ధతులను అనుసరించాడు. తొలుత కబీర్ ఉద్యోగం వదిలేసి, పూర్తిగా ఈ పనిలో ఉన్నాడు. "ప్రకృతి మధ్య గడపాలనుకునేవారికి ఆహ్వానం" అంటూ ఒక వెబ్ పేజీని రూపొందించాడు. మొదటినుంచీ దానికి మంచి స్పందనే లభించింది. ఎక్కడెక్కడివారో ఆ ఊరికి వచ్చి, అక్కడి పొలాల్లో, సెలయేళ్లలో, పచ్చిక బయళ్లలో, పర్వతశ్రేణుల్లో హాయిగా గడపటం మొదలు పెట్టారు. వారికి ఏఏ వంటలు కావాలో అడిగి, అప్పుడే పొలాల నుంచి తీసుకొచ్చి వండి పెట్టించేవాడు కబీర్. నెమ్మదిగా ఆ పల్లె'టూరు' పుంజుకొంది. నాలుగేళ్ల తరువాత అహనా కూడా తన ఉద్యోగాన్ని, వదిలేసి, "పాలిఘర్" టూరిజాన్ని అభివృద్ధి చేయడంలో భర్తకు తోడుగా నిలబడింది.

అతిధులకు కేవలం పల్లెటూరులో ఆతిథ్యం కల్పిస్తేనే సరిపోదు. వారు ఉన్నన్ని రోజులూ ప్రకృతిలో గడిపే అవకాశాలు ఉండాలి. నగర జీవితానికి పూర్తి భిన్నమైన అనుభవాన్ని ఇవ్వగలగాలి. అందుకనే కబీర్ - అహనా మూడు, నాలుగు రకాల కార్యక్రమాలు రూపొందించారు. అతిథుల వయసు, ఆసక్తి, అభిరుచులను బట్టి వారు ఏదొక యాక్టివిటీని ఎంచుకోవొచ్చు. వారికి అవసరమైన సహాయ సహకారాలు పాలిఘర్ నుంచి అందిస్తారు. ఆ ఊరు డార్జిలింగ్‌కు దగ్గర్లో ఉంది. ఆ కొండల పైకి ట్రెక్కింగ్‌కి వెళ్లొచ్చు. వాగుల్లో ఈత కొడుతూ, చేపలు పడుతూ, ఆ గట్టు మీదనే వండుకు తింటూ కాలక్షేపం చేయొచ్చు. ఆయా కాలాల నుంచి పొలాల్లో నాట్లు వేయొచ్చు. కలుపు తీయొచ్చు. కోత కోయొచ్చు. నూర్పిడి చేయొచ్చు. తమకు కావాల్సిన కాయగూరలను తామే పొలాల నుంచి సేకరించొచ్చు. తోటల్లో ఆడొచ్చు పాడొచ్చు. 4, 5 కిలోమీటర్ల చుట్టుదారిలో కాలి నడకన అడవి అందాలను తిలకించవొచ్చు. వివిధ జంతువుల, పక్షుల ఫొటోలు తీసుకోవొచ్చు. లేదూ సమీపంలో ఉన్న గ్రామాల్లో తిరిగి రావొచ్చు. స్థానికుల జీవన స్థితిగతులను పరిశీలించొచ్చు. వారితో మాట్లాడుతూ, మమేకం అవుతూ గడపొచ్చు. ఇలా అతిథుల ఆసక్తిని బట్టి, తిరగగలిగిన ఓపికను బట్టి, బృందాల వారీగా కార్యక్రమాలను ఎంచుకోవొచ్చు. వారికి ఎలా కావలిస్తే అలా పాలిఘర్ సిబ్బంది ఆహార, రవాణా ఏర్పాట్లు చేస్తారు.

ఒక్కో ఇంట్లో రెండు పడక గదులు, ఒక హాలు, ఒక వంటశాల ఉంటాయి. అతిథులు తమకు కావాల్సిన వంటలను వండించుకునే అవకాశం ఉంది. కాకుంటే– అవన్నీ అక్కడి సాంప్రదాయ వంటలే. అందులో తమకు కావాల్సినవి ఉంచుకోవొచ్చు. కబీర్ - అహనా ప్రారంభించిన ఈ పల్లె'టూరు'కు మంచి ఆదరణే లభిస్తోంది. ఆన్‌లైన్లో ఏడాది ముందుగానే గదుల బుకింగ్ జరిగిపోతోంది. దేశవిదేశాల నుంచి ఎందరో ఈ పల్లె'టూరు'ను ఇష్టపడుతున్నారు. ఊపిరి సలపని నగరాల నుంచి, జీవనం నుంచి ఉపశమనం కోసం, కొత్త ఉత్సాహం కోసం భవిష్యత్తులో ఈ తరహా టూరిజానికి మరింత ఆదరణ పెరిగే అవకాశం ఉంది. స్థానికంగా ఉన్న ప్రకృతిపరమైన సందర్శక ప్రాంతాలతో అనుసంధానం చేసుకుంటూ– పల్లెల్లో ఇలాంటి అతిథి గృహాలు మరిన్ని నెలకొనవొచ్చు.

విశాలమైన ప్రదేశాలు, అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, మహావృక్షాలు, పర్వతశ్రేణులూ మాట్లాడలేవు కానీ, సహజంగా, సరళంగా, సంతోషంగా, సమైక్యంగా జీవించమని ప్రతి క్షణం సందేశాన్ని ఇస్తాయి. మనసారా జీవించటానికి అలాంటి ప్రబోధం అవసరమే కదా!

బర్త్‌డే గిఫ్ట్‌గా టీజర్ రిలీజ్



రామ్

రామ్, పూరి జగన్నాథ్ కాంబోలో రాబోతున్న పాన్ ఇండియా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' నుండి మేకర్స్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్ర టీజర్‌ను ఈనెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయనున్నారు. టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రామ్ ఫేస్ మాస్క్‌తో పవర్–ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. 'ఇస్మార్ట్ శంకర్' సెకండ్ ఇన్‌స్టాల్‌మెంట్‌గా వస్తున్న ఈ హై–బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం ముంబయిలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ప్రముఖ తారాగణం అంతా పాల్గొంటున్నారు. ఈ సీక్వెల్‌లో డబుల్ యాక్షన్, డబుల్ మాస్, డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని, సంజయ్ దత్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్న ఈ సినిమా కోసం రామ్ పోతినేని స్టైలిష్ మేకోవర్ అయ్యారని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఈ సినిమా విడుదల కానుంది.

రక్షణ కోసం రంగంలోకి..



పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్100', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తోన్న సినిమా 'రక్షణ'. రోషన్, మానస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో పాయల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించబోతున్నారు. ఈ మూవీ శరవేగంగా రూపొందుతోంది. హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకోర్ దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటి వరకు పాయల్ రాజ్‌పుత్ చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైన సినిమా. సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఆసాంతం కట్టిపడేయనున్న ఈ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గురించి దర్శక, నిర్మాత ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ, "రక్షణ ఓ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. పాయల్ రాజ్‌పుత్‌ను సరికొత్త కోణంలో చూపించే సినిమా. నటిగా ఆమెకు మంచి ఇమేజ్‌ను తీసుకొస్తుంది. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన సంఘటన స్ఫూర్తితో రాసిన కథతో సినిమా రూపొందింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. రాజీవ్ కనకాల, వినోద్ బాల, శివన్నారాయణ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.



ఆర్జే శ్వేత, యష్ రంగినేని

ఆర్జే శ్వేత దర్శకత్వంలో అమ్మ

నిర్మాత యష్ రంగినేని సారథ్యంలో 'పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని, అన్నపూర్ణ ఫొటో స్టూడియో' వంటి సక్సెస్ ఫుల్ సినిమాలను నిర్మించిన బిగ్ బెన్ సినిమాస్ సంస్థ తమ ప్రొడక్షన్ నెం.7గా 'అమ్మ' మూవీని నిర్మిస్తోంది.

ఆదివారం మదర్స్ డే సందర్భంగా ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంతో ఆర్జే శ్వేత పీవీఎస్ దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఎమోషనల్ థ్రిల్లర్ కథతో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ మూవీ అనౌన్స్ మెంట్ సందర్భంగా టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అమ్మ ఫొటో బ్యాక్ డ్రాప్‌లో అగ్ని జ్వాలల మధ్య పంజరం, పక్షి ఫొటోతో ఈ పోస్టర్ డిజైన్ చేశారు. మదర్ సెంటిమెంట్‌తో సరికొత్త ఎమోషనల్ థ్రిల్లర్ మూవీగా అమ్మ సినిమా ఉండనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

నవ్విస్తూనే భయపెడతా



నందితా శ్వేత

హారర్, కామెడీతో ఉండే సినిమాలకు అన్ని వర్గాల ఆడియన్స్ నుంచి ఆదరణ లభిస్తోంది. అలాగే హారర్ కామెడీ జోనర్లలో వచ్చే చిత్రాలకు ఇటు ఓటీటీ, అటు థియేటర్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు అదే ఫార్ములాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది 'ఓ మంచి ఘోస్ట్' మూవీ. మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్‌పై హాస్యభరితమైన హారర్ సినిమాగా ఇది రానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన గ్లింప్స్, లిరికల్ సాంగ్ ఇలా ప్రతీ ఒక్కటీ ప్రేక్షకుల్లో బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక తాజాగా రిలీజ్ చేసిన టీజర్ అందరినీ నవ్వించడమే కాకుండా భయపెట్టేస్తోంది. ఈ టీజర్‌లోని విజువల్స్, ఆర్‌ఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆండ్రూ సినిమాటోగ్రఫీ, అనూప్ రూబెన్స్ ఇచ్చిన ఆర్‌ఆర్ టీజర్‌లో ఎక్కువగా హైలెట్ అవుతున్నాయి. ఈ చిత్రానికి సుప్రియ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఎడిటింగ్ బాధ్యతల్ని ఎం.ఆర్.వర్మ చేపట్టారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నందితా శ్వేత, షకలక శంకర్, నవమి గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, హాస్యనటుడు రఘుబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

చెన్నై నిలిచింది!



- రాజస్థాన్‌పై సూపర్‌కింగ్స్ గెలుపు
- 3 వికెట్లతో విజృంభించిన సిమ్రన్‌జిత్ సింగ్
- ఛేదనలో రాణించిన రుతురాజ్ గైక్వాడ్
- రాజస్థాన్ 141/5, చెన్నై 145/5



చెన్నై సూపర్‌కింగ్స్ నిలిచింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 17వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులో ఆశలు సజీవంగా నిలుపుకుంది. చెపాక్‌లో ఆదివారం జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సీమర్ సిమ్రన్‌జిత్ సింగ్ (3/26) విజృంభించటంతో తొలుత రాజస్థాన్ రాయల్స్ 141/5 పరుగులు చేసింది. ఛేదనలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్) రాణించటంతో మరో పది బంతులు ఉండగానే సూపర్‌కింగ్స్ లాంఛనం ముగించింది.

చెన్నై : చెన్నై సూపర్‌కింగ్స్ ఊపిరి పీల్చుకుంది. ఐపీఎల్ 17 ప్లే ఆఫ్స్ దశ పోటీ తారాస్థాయికి చేరుకున్న తరుణంలో అగ్రజట్టు రాజస్థాన్ రాయల్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 142 పరుగుల ఛేదనలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్, 41 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) అజేయ ఇన్నింగ్స్‌తో రాణించగా.. శివం దూబె (18, 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (27, 18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) , డార్లీ మిచెల్ (22, 13 బంతుల్లో 4 ఫోర్లు) సమిష్టిగా రాణించారు. దీంతో 18.2 ఓవర్లలోనే చెన్నై సూపర్‌కింగ్స్ 5 వికెట్లకు 145 పరుగులు చేసింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులు చేసింది. పరుగుల సాధన గగనమైన పిచ్‌పై రియాన్ పరాగ్ (47 నాటౌట్, 35 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాయల్స్‌ను ఆదుకున్నాడు. ధ్రువ్ జురెల్ (28, 18 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (24, 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. సూపర్‌కింగ్స్ యువ పేసర్ సిమ్రన్‌జిత్ సింగ్ (3/26) మూడు వికెట్ల ప్రదర్శనతో రాయల్స్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది సీజన్లో 13 మ్యాచుల్లో ఏడో విజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు 12 మ్యాచుల్లో నాల్గో పరాజయం కావటం గమనార్హం. చెన్నై సూపర్‌కింగ్స్ పేసర్ సిమ్రన్‌జిత్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

రుతురాజ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ : సూపర్‌కింగ్స్ లక్ష్యం 142 పరుగులు. చెపాక్ పిచ్‌పై ఇది భారీ టార్గెట్. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (27), రుతురాజ్ గైక్వాడ్ (42 నాటౌట్) ఛేదనను కాస్త సులభతరం చేశారు. రచిన్ రవీంద్ర పవర్‌ప్లేలో ఎదురుదాడి చేశాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో మెరిశాడు. అశ్విన్ ఓవర్లో రచిన్ అవుటైనా.. డార్లీ మిచెల్ (22) దంచికొట్టాడు. నాలుగు బౌండరీలతో దండయాత్ర చేశాడు. దీంతో పవర్‌ప్లేలో 56 పరుగులు సాధించిన సూపర్‌కింగ్స్ విజయానికి గట్టి పునాది వేసుకుంది. ఓ ఎండ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన రుతురాజ్ గైక్వాడ్ ఆఖరు వరకు క్రీజులో అజేయంగా నిలిచాడు. మోయిన్ అలీ (10), రవీంద్ర జడేజా (5) నిరాశపరిచినా.. శివం దూబె (18), సమీర్ రిజ్వీ (15 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. రాయల్స్ బౌలర్లలో స్పిన్నర్ అశ్విన్ (2/35), చాహల్ (1/22) రాణించినా.. 18.2 ఓవర్లలోనే సూపర్‌కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. సీజన్లో ఏడో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

సిమ్రన్‌జిత్ సూపర్ : రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లను సూపర్‌కింగ్స్ పేసర్లు సిమ్రన్‌జిత్ సింగ్ (3/26), తుషార్ దేశ్‌పాండే (2/30) నిప్పులు చెరిగే స్పెల్స్‌తో కట్టడి చేశారు. విధ్వంసక ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (24), జోశ్ బట్లర్ (21) క్రీజులో నిలిచినా.. పవర్‌ప్లేలో రాజస్థాన్ 42 పరుగులే చేసింది. సిమ్రన్‌జిత్ వరుస ఓవర్లలో యశస్వి జైస్వాల్, జోశ్ బట్లర్‌ను సాగనంపాడు. కెప్టెన్ సంజు శాంసన్ (15) సైతం సిమ్రన్‌జిత్‌కు వికెట్ కోల్పోయాడు. రియాన్ పరాగ్ (47 నాటౌట్) క్లిష్ట తరుణంలో క్రీజులో నిలిచాడు. ధ్రువ్ జురెల్ (28)తో కలిసి ఇన్నింగ్స్‌కు ముందుకు నడిపించాడు. జురెల్ నిష్క్రమణ, శుభమ్ దూబె (0) నిరాశరపర్చటంతో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులు చేసింది.

రాణించిన రజత్

- రాయల్ చాలెంజర్స్ బెంగళూర్



బెంగళూర్ : రజత్ పాటిదార్ (52, 32 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) జోరు కొనసాగించాడు. ధనాధన్ అర్ధ సెంచరీలతో కదం తొక్కుతున్న రజత్ పాటిదార్ చిన్నస్వామి స్టేడియంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌పై దండయాత్ర చేశాడు. విల్ జాక్స్ (41, 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) సైతం రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (27, 13 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) పవర్‌ప్లేలో దంచికొట్టాడు. మూడు సిక్సర్లతో చెలరేగిన కోహ్లి..ఇషాంత్ శర్మకు వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ డుప్లెసిస్ (6) నిరాశపరిచాడు. రజత్ పాటిదార్ (52) మరో అర్ధ సెంచరీతో ఫామ్ కొనసాగించగా.. విల్ జాక్స్ వరుస వైఫల్యాలకు చెక్ పెట్టాడు. కామెరూన్ గ్రీన్ (32 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) డెత్ ఓవర్లలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు మంచి స్కోరు అందించాడు. మహిపాల్ లామ్రోర్ (13), దినేశ్ కార్తీక్ (0), స్వప్నిల్ సింగ్ (0), కరణ్ శర్మ (6), మహ్మద్ సిరాజ్ (0) విఫలమయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ (2/31), రషీక్ (2/23) రెండేసి వికెట్లతో రాణించారు.

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ × కోల్‌కత
వేదిక : అహ్మదాబాద్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68